

ప్రయాణికులతో అనంత ఆర్టీసీ బస్టాండు కిటకిట..

ఇంక పండగే..!

దసరా సెలవుల ప్రకటనతో సొంతూళ్లకు విద్యార్థులు

(6లో..)



చేతులు, ప్లేట్లు కడుక్కునే ఉప్పునీటినే తాగుతున్న కేఎస్ఆర్ విద్యార్థినులు

అనంతపురం నగర నడిబొడ్డున ఉన్న కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు నీటి కష్టం వచ్చింది. పాఠశాలను 'ఆంధ్రజ్యోతి' శనివారం విజిట్ చేసింది. అక్కడి బాలికలు గుక్కెడు నీటికోసం అల్లాడిపోతున్న దృశ్యం కళ్లకు కట్టింది. బాలికలు ఉదయం బడికి వస్తే.. సాయంత్రం వరకూ లోపలే ఉండిపోతారు. ఆరు నెలల క్రితం బడిలో ఉన్న వాటర్ ప్లాంట్ చెడిపోయింది. అప్పటి నుంచి చేతులు, ప్లేట్లు శుభ్రం చేసుకునే నీటితోనే దాహం తీర్చుకుంటున్నారు. నాడు-నేడు పథకం కింద 2022-23లో ఈ పాఠశాలకు వాటర్ ప్లాంట్ ఇచ్చారు. అంత మంది విద్యార్థినులకు ఈ ఒక్క ప్లాంట్ నీరు సరిపడేది కాదు. అయినా క్రమశిక్షణతో సర్దుకుపోయేవారు. ఆ ఒక్కటి కూడా ఆరు నెలల క్రితం చెడిపోయింది. మరమ్మతు గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. జిల్లా కేంద్రం నడిబొడ్డున, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఇలాంటి సమస్య నెలల తరబడి పరిష్కారం కాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.



– ఆంధ్రజ్యోతి, అనంతపురం విద్య

ఆంధ్రజ్యోతి విజిట్

బంగారు తల్లికి ఉప్పు నీరే గతి..!

ప్లేట్లు కడిగే నీటిని తాగుతున్న బాలికలు

"అంకుల్..! మా స్కూల్‌లో తాగడానికి మంచి నీళ్లు లేవు. చేతులు, ప్లేట్లు కడుక్కునే నీటినే తాగుతున్నాం. కొన్ని నెలల నుంచి ఈ ఉప్పు నీరు తాగలేక ఇబ్బంది పడుతున్నాం. మీరైనా మాకు మంచి నీరు వచ్చేలా చూడండి. కానీ మా ఫొటోలను పేపర్లో వేయొద్దు..! మా మేడమ్ వాళ్లు.. సార్ వాళ్లు చూస్తే మమ్మల్ని ఇబ్బంది పెడతారు.."

"ఇంటి నుంచి.. హాస్టల్ నుంచి వాటర్ బాటిల్‌లో నీళ్లు తెచ్చుకుంటాం. ఎప్పుడైనా మరిచిపోతే ఫ్రెండ్స్‌ను అడిగి తాగుతాం. వాళ్లు ఇవ్వకుంటే ఉప్పు నీళ్లే తాగుతాం..! లేదంటే సాయంత్రం ఇంటికో, హాస్టల్‌కో వెళ్లాక నీళ్లు తాగుతాం. అప్పటిదాకా దప్పికతో ఇబ్బంది పడక తప్పడం లేదు. ఉప్పు నీళ్లు తాగినా దాహం తీరడంలేదు.."

ఇదీ.. బాలికల ఆవేదన



నీరు తాగకపోతే..

నీరు తాగకపోతే ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం పడుతుంది. డీ హైడ్రేషన్ కారణంగా ప్రాణాపాయం తలెత్తుతుంది. జీర్ణక్రియ సమస్యలు, తల తిరగడం, చర్మ సమస్యలు, అలసట.. ఇలా అనేక సమస్యలు ఉత్పన్నమౌతాయి. ఇక బోరు నుంచి నేరుగా వచ్చే నీటిలో ఫ్లోరైడ్ సహా అనేక హానికారక పదార్థాలు ఉంటాయి. ఫ్లోరైట్ నీటిని తాగితే దంతాలు, ఎముకల సమస్య తలెత్తుతుంది. ఫ్లోరోసిస్ వ్యాధిబారిన పడే ప్రమాదం ఉంటుంది. బడికి వెళ్లే బాలలకు నీరు తాగే సమయం ఉండదు. చదువుల ఒత్తిడో ఉండి చాలామంది నీరు తాగకుండా నిర్లక్ష్యం చేస్తారు. ఈ సమస్యలను గుర్తించిన ప్రభుత్వం, గతంలో బడిలో 'వాటర్ బెల్'ను అమలు చేసింది. తాగునీటికి ఇంత ప్రాధాన్యం ఉంది. అలాంటిది తాగుదామంటే చుక్క నీరు దొరకని పరిస్థితి నెలల తరబడి కొనసాగటం ఏమిటి..?

మంచి బడి

సప్తగిరి సర్కిల్‌లో ఉన్న కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చాలా మంచి పేరు ఉంది. అందుకే ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థలకు పంపలేనివారు తమ బిడ్డలను ఇక్కడ చేర్పించేందుకు ఆసక్తి చూపుతారు. నగరంలోని బాలికలు ఇళ్ల వద్ద నుంచి, దూర ప్రాంతాలవారు హాస్టళ్ల నుంచి ఈ బడికి వచ్చి వెళతారు. నగరం చుట్టుపక్కల మండల కేంద్రాలు, గ్రామాల నుంచి వందలాది మంది బాలికలు బస్సులు, ఆటోలలో వస్తుంటారు. ఈ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకూ ఏకంగా 1,418 మంది బాలికలు చదువుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్‌లను పరిశీలిస్తే.. ఒక మండలంలోని అన్ని పాఠశాలల్లో కలిపి కూడా ఇంత మంది ఉండరు. ఉత్తమ విద్యను అందిస్తూ, తల్లిదండ్రుల నమ్మకం సంపాదించుకున్న ఇలాంటి పాఠశాలలో సమస్యలను అధికారులు పట్టించుకోకపోవడం దారుణం.

నిధులిచ్చినా.. నిర్లక్ష్యం

కేఎస్ఆర్ పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.6 లక్షలు ఇచ్చారు. నిధులు ఇచ్చి నెలలు గడిచినా కొత్త ప్లాంట్ ఏర్పాటు కాలేదు. పనులు నత్తనడకన సాగుతున్నాయి. తాగునీటి సమస్య తీవ్రం కావడంతో ఆ మాత్రం పనులైనా చేశారని తెలుస్తోంది. పట్టుమని పది మంది విద్యార్థులు లేని పాఠశాలల్లో ఏవేవో పనులు చేయిస్తుంటారు. ఇలాంటి చోట చిన్నపాటి సమస్యను పరిష్కరించకుండా, బాలికల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు.

- కేఎస్ఆర్ బాలికోన్నత పాఠశాలలో దుస్థితి
- 1,418 మంది విద్యార్థినులకు నిత్యం నరకం
- ఆరు నెలల క్రితం చెడిపోయిన ఆర్వో ప్లాంట్
- మరమ్మతులు చేయని ఏజెన్సీ..
- పట్టించుకోని అధికారులు



మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థినులు

ఏజెన్సీ పట్టించుకోవడం లేదు..

ఆర్వో ప్లాంట్ చెడిపోయింది. మరమ్మతు చేయాలని ఏజెన్సీకి చెప్పినా పట్టించుకోవడం లేదు. ఈ ప్లాంట్‌తో సంబంధం లేదని అంటున్నారు. కొత్త ప్లాంట్ ఏర్పాటుకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ రూ.6 లక్షలు ఇచ్చారు. పనులు ముగింపు దశకు వచ్చాయి. దసరా సెలవులు ముగిసేలోగా సమస్యను పరిష్కరిస్తాం.

- బాలకృష్ణుడు, హెచ్ఎం

చొరవ చూపాలి కదా..!



తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించేదాకా ప్రత్యామ్నాయం గురించైనా ఉపాధ్యాయులు ఆలోచించాల్సింది. నగరంలో ఎన్నో స్వచ్ఛంద సంస్థలు, స్వచ్ఛంద సేవకులు ఉన్నారు. అలాంటివారిని అడిగితే కావాల్సినన్ని శుద్ధ జలం ట్యాంకర్లను నిత్యం బడికి తీసుకువెళ్లి నిలుపుతారు. కానీ ఆ మాత్రం చొరవ చూపేవారేరీ..? బడి అంటే.. చదువొక్కటే కాదు. ఈ విషయాన్ని గురువులు అర్థం చేసుకోవాలి.

చంద్రన్న అభయం

రెండేళ్లలో బీటీపీ కాలువల నిర్మాణం పూర్తి చేస్తాం

- అసెంబ్లీలో సీఎం ప్రకటన
- కళ్యాణదుర్గంలో హర్షాతిరేకాలు



అసెంబ్లీలో బీటీపీపై మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభయమిచ్చారు. కళ్యాణదుర్గానికి నీరిచ్చే భైరవాన్‌తిప్ప ప్రాజెక్టు (బీటీపీ) కాలువల నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేస్తామని అసెంబ్లీలో ప్రస్తావించారు. దీంతో నియోజకవర్గంలో ప్రజలు, రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సొంత నిధులు వెచ్చించి బ్రహ్మసముద్రం మండలం పడమటికోడిపల్లి సమీపాన బీటీపీ కాలువ పనులు పునఃప్రారంభించారు. అవి శరవేగంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం అసెంబ్లీలో ప్రకటించడంతో కాలువ పనులు జోరందుకోనున్నాయి.



కొనసాగుతున్న కాలువ పనులు

భైరవాన్‌తిప్పకు జవసత్వాలు

గత వైసీపీ ప్రభుత్వం బీటీపీ కాలువ పనులను గాలికొదిలేసింది. ఐదేళ్లలో గంప మట్టి కూడా తీయలేదు. కూటమి అధికారం చేపట్టగానే పెండింగ్ పనులపై దృష్టి సారించింది. తాజాగా కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలను సస్యశ్యామలం చేసే జీడిపల్లి-భైరవానితిప్ప ఎత్తిపోతల పథకం పనులను సీఎం అసెంబ్లీలో ప్రస్తావించడంతో ఊపందుకోబోతున్నాయి. గుమ్మఘట్ట మండలంలోని భైరవాన్‌తిప్ప ప్రాజెక్టు కింద 12 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఎగువన కర్ణాటక రాష్ట్రం వేదవతిపై నాలుగు చెక్‌డ్యాంలు నిర్మించడంతో ఈ ప్రాజెక్టుకు వరద తగ్గిపోతూ వచ్చింది. ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. జీడిపల్లి నుంచి కృష్ణాజలాలను తరలించాలని గతంలోనే టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. 2018 అక్టోబరులో సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా గరుడాపురం వద్ద పనులకు శంకుస్థాపన చేసి రూ.968 కోట్లు కేటాయించారు. బెళుగుప్ప, కళ్యాణదుర్గం, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల పరిధిలో భూసేకరణకు రూ.120 కోట్లు కేటాయించారు. కాలువ పనులు వేగంగా చేపట్టారు. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

50 వేల ఎకరాలకు సాగునీరు

జీడిపల్లి-భైరవాన్‌తిప్ప ఎత్తిపోతల పథకంలో 14 లిఫ్టుల ద్వారా 114 చెరువులకు నీరు అందించాలనేది లక్ష్యం. వీటిలో 79 పెద్ద, 36 చిన్న చెరువులు ఉన్నాయి. చెరువులు నింపడంతోపాటు ఆయాప్రాంతాల్లోని 50 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశాలున్నాయి.

కర్షకుల ఆశలు నెరవేరుస్తాం



నియోజకవర్గంలోని 114 చెరువులను కృష్ణాజలాలతో నింపి, కర్షకుల ఆశలను నెరవేరుస్తాం. ఇదే నా ప్రధాన ఆశయం. భైరవాన్‌తిప్ప ప్రాజెక్టు కాలువ పనులను పూర్తి చేసి జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కృష్ణాజలాలు తీసుకొస్తాం. ఆ దిశగా ఇప్పటికే పనులన్నీ జోరుగా సాగుతున్నాయి. సాగు, తాగునీరు అందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం. అసెంబ్లీలో కూడా సీఎం చంద్రబాబునాయుడు ఈ ప్రాజెక్టు కాలువ పనులను ప్రస్తావించడంతో ఇక్కడున్న రైతులు, ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

- అమిలినేని సురేంద్రబాబు, ఎమ్మెల్యే, కళ్యాణదుర్గం

22న విడుదల..!

అందరి దృష్టి.. ఆ తేదీపైనే..!

- జీఎస్టీ ఎఫెక్ట్..
- తగ్గిన వాహనాల కొనుగోలు
- షో రూంల నుంచి కదలని కార్లు, బైక్‌లు
- 22 పైనే కంపెనీల ఆశలు



అనంతపురంలోని మహీంద్రా షోరూం, శివ్‌సాయి హోండా షోరూం



అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏటా దసరా పండుగ సందర్భంగా వాహనాల కొనుగోళ్లతో షోరూమ్‌లు బిజీగా ఉండేవి. నిర్వాహకులు సైతం కొత్త కొత్త ఆఫర్లు ప్రకటించేవారు. దీంతో వినియోగదారులతో కిటకిటలాడుతూ కనిపించేవి. ఇప్పుడు సీజన్ ఉన్నా అవే షోరూంలలో సందడి లేదు. మేనేజర్లు, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు ఆఫర్ల మీద దృష్టి పెడుతుంటే... అమ్మకాల కోసం సేల్స్‌మెన్ తంటాలు పడుతున్నారు. ఈనెల 22వ తేదీ నుంచి వస్తు సేవల పన్ను(జీఎస్టీ) తగ్గింపుతో ధరలు తగ్గనున్నాయి. ఇదివరకు ఉన్న 5, 12, 18, 28 శాతంగా ఉన్న పన్ను రేట్లలో ఇకపై 5, 18 పన్ను రేట్లు మాత్రమే కొనసాగనున్నాయి. ఈ మేరకు ఈనెల 3వతేదీ జీఎస్టీ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పాలు, పనీర్, బిస్కెట్లు, సబ్బులు, షాంపూల నుంచి ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, ద్విచక్రవాహనాలు, చిన్న కార్ల వరకు ధరలు దిగిరానున్నాయి. వైద్యపరికరాలపై జీఎస్టీని 12 నుంచి 5శాతానికి తగ్గించారు. నోట్ బుక్స్, పెన్సిళ్లు, క్రెయాన్లు, మ్యాప్‌లు, చార్టులపై జీఎస్టీ రద్దు చేయడంతో విద్యార్థులపై భారం తగ్గినట్లయింది. హానికర, విలాస వస్తువులపై మాత్రం 40శాతం ప్రత్యేక పన్ను విధిస్తారు. పాన్ మసాలాలు, గుట్కా, సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులపై ప్రస్తుతమున్న ధరలే కొనసాగేలా పన్నులుంటాయి. కాగా నిత్యం వాడే ఫోన్లలో మాత్రం మార్పు లేకపోవడం గమనార్హం.

అందరి దృష్టి కార్లు, బైక్‌లపైనే..

జీఎస్టీ తగ్గింపుతో అందరి దృష్టి కార్లు, బైక్‌లపై పడింది. ఆటోమొబైల్ రంగంపై జీఎస్టీని 28 నుంచి 18 శాతానికి తగ్గించారు. పెట్రోల్, పెట్రోల్-హైబ్రిడ్, ఎల్పీజీ, సీఎన్‌జీ కార్లు (1200 సీసీ, 4000ఎంఎం లోపు), డీజిల్, డీజిల్-హైబ్రిడ్ కార్లు (1500సీసీ, 4000ఎంఎం లోపు మాత్రమే), త్రిచక్ర వాహనాలు (ఆటోలు తదితర), 350 సీసీలోపు ఉండే మోటారు సైకిళ్లు, రవాణా వాహనాలకు ఇది వర్తిస్తుంది. బైక్‌లపై రూ.7వేల నుంచి రూ.13వేల వరకు ధరలు తగ్గనున్నాయి. కార్లపై రూ.50వేల నుంచి రూ.1.70 లక్షల వరకు ధరలు

(మిగతా 7లో...)

ప్లాస్టిక్ రహిత నగరంగా అనంత

స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



(వివరాలు 6వ పేజీలో..)

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం: కలెక్టర్

(వివరాలు 6వ పేజీలో..)

స్మార్ట్ రైస్ కార్డులను ఇంటి వద్దకే వెళ్లి ఇవ్వండి: జేసీ

(వివరాలు 6వ పేజీలో..)

అదృశ్యమైన తల్లీ బిడ్డలు సేఫ్

(వివరాలు 7వ పేజీలో..)

రోడ్ల నిర్మాణానికి నిధులివ్వండి

ఉప ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే శ్రావణిశ్రీ వినతి

శింగనమల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు నిధులివ్వాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. విజయవాడలో డిప్యూటీ సీఎంను ఎమ్మెల్యే శనివారం మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వాలని వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వంలో చాలా రోడ్లు అభివృద్ధికి నోచుకోలేదనీ, గుంతలమయమయ్యాయన్నారు. పంచాయతీరాజ్ శాఖ తరఫున గ్రామీణ రోడ్ల మరమ్మతులు, నిర్మాణానికి పెద్దమొత్తంలో నిధులు మంజూరు చేయాలని కోరారు. గండికోట రిజర్వాయర్ నీటి ప్రాజెక్టులకు ఆర్‌డబ్ల్యూఎస్ ఇతర శాఖల ద్వారా పరిపాలన అనుమతులు మంజూరు చేయాలనీ, అప్పుడే నియోజకవర్గంలో నీటి సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. పుట్లూరు, యల్లనూరు మండలాల నీటి సమస్య తీరుతుందన్నారు. వీటిపై డిప్యూటీ సీఎం సమస్యపై సానుకూలంగా స్పందిస్తూ నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



డిప్యూటీ సీఎంకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ఏపీఎంఐపీకి స్కోచ్ అవార్డు

ఢిల్లీలో అందుకున్న పీడీ రఘునాథరెడ్డి

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనంత ఏపీఎంఐపీ సంస్థకు స్కోచ్ అవార్డు లభించింది. 2024-25 సంవత్సరంలో జిల్లాలో ఏపీఎంఐపీ పథకం అమలుతీరుకు స్కోచ్ గోల్డ్ అవార్డు దక్కింది. దేశరాజధాని ఢిల్లీలో శనివారం స్కోచ్ గ్రూప్ వ్యవస్థాపకులు, చైర్మన్ సమీర్ కొచ్చర్ చేతుల మీదుగా ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, అప్పటి ఏపీడీ ఫిరోజ్‌ఖాన్‌లు స్కోచ్ గోల్డ్ అవార్డును అందుకున్నారు. 2024-25 సంవత్సరంలో 18వేల హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్లను మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. అప్పట్లో 14869 మంది రైతులకు 17642 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్లను (98 శాతం) మంజూరు చేశారు. తద్వారా జాతీయ స్థాయిలో అనంత జిల్లా రెండో స్థానం, రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలోనే అనంత ఏపీఎంఐపీ శాఖకు స్కోచ్ గోల్డ్ -2025 అవార్డు దక్కింది. గత మూడేళ్లుగా జిల్లా రైతులకు సూక్ష్మపరికరాలు అందించడంలో అగ్ర స్థానంలో నిలిచినట్లు ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి పేర్కొన్నారు.



స్కోచ్ గోల్డ్ అవార్డు అందుకుంటున్న ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, అప్పటి ఏపీడీ ఫిరోజ్ ఖాన్

తిరుపతి రైలును పెద్దపల్లి వరకు నడపండి

రైల్వే శాఖ సహాయ మంత్రికి ఎమ్మెల్యే అమిలినేని వినతి



రైల్వే సహాయ మంత్రికి విన్నవిస్తున్న ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కదిరిదేవరపల్లి నుంచి తిరుపతికి వెళ్లే రైలును కర్ణాటక ప్రాంతమైన పెద్దపల్లి వరకు నడపాలని కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్నకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు విన్నవించారు. టీడీపీ నాయకుడు రాజగోపాల్‌తో కలిసి ఎమ్మెల్యే కేంద్ర రైల్వేశాఖ సహాయ మంత్రిని శనివారం బెంగళూరులో కలిశారు. కర్ణాటక ప్రాంతమైన పెద్దపల్లి వరకు కూడా రైల్వే ట్రాక్ పనులు పూర్తి చేశారన్నారు. ట్రయల్ రన్ కూడా పూర్తయిందన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గానికి ఇదొక్క రైలు మాత్రమే నడుపుతున్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఆ రైలును పెద్దపల్లి వరకు కొనసాగించాలని విన్నవించారు. ఈ ప్రాంతంలో సామాన్య ప్రజలు, రైతులకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని కోరారు. అందుకు కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ప్లాస్టిక్ రహిత నగరంగా అనంత

స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



డివైడర్లపై మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారం, భాగస్వామ్యంతో అనంతపురాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. అనంత నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సూర్యానగర్ రోడ్డులో శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని రవికుమార్, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్, అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో కలిసి ఎమ్మెల్యే డివైడర్ల మధ్యలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నగరంలో 500 మొక్కల నాటారు. అంతకుముందు నగరంలో పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతామని అధికారులు, నాయకులు, ప్రజలతో ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతినెల మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మహిళలు, ప్రజలు మురుగు కాలవలు, రోడ్లపై చెత్త వేయకుండా ఇంటి వద్దకు వచ్చిన మున్సిపల్ కార్మికులకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఏడాది కాలంలోనే నగరంలో 95శాతం ప్లాస్టిక్‌ను నివారించామని, గత ఆరు నెలలుగా ఏఎంసీ, విజిలెన్స్ అధికారులు నిత్యం దాడులు చేస్తున్నారని తెలిపారు. ప్రజల సహకారంతో దేశంలోనే అనంతను రోల్‌మోడల్‌గా మారుస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఎస్ఈ రాజశేఖర్, టీడీపీ నాయకులు తలారి ఆదినారాయణ, కోనంకి గంగారామ్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు రంగాచారి, పోతుల లక్ష్మీనరసింహులు, పీఎల్ఎన్ మూర్తి, కొండన్న, బొమ్మినేని శివ, కార్పొరేటర్లు బాలాంజినేయులు, బాబా, నాయకులు సింగవరం రవి, రాజారావు, అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ కృష్ణకుమార్, సంగా తేజస్విని, సాకే లక్ష్మీనరసింహ, సుధాకర్ యాదవ్, ఫిరోజ్ అహ్మద్, ఏఎంసీ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సుందరీకరణ వేగవంతం చేయండి

● ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



గంగపూజ చేస్తున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో చిత్రావతి నదీ తీర సుందరీకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్‌కు ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి సూచించారు. కర్ణాటక ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు చిత్రావతి నది పొంగి ప్రవహిస్తోంది. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి నదిని ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాలనాటికి అభివృద్ధి పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. చిత్రావతి నదీ పరివాహకంలోని ముంపు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అనంతరం ఎనుమలపల్లి చెరువు మరువ వద్ద గంగపూజ నిర్వహించారు.



అనంత బస్టాండు: ఎప్పుడొస్తుందబ్బా.. మనూరి బస్సు

ఇంక పండగే..!

దసరా సెలవుల ప్రకటనతో సొంతూళ్లకు విద్యార్థులు



పిల్లోళ్లు ఎబ్బుడు వస్తారో..?
(బడి బయట తల్లిదండ్రుల నిరీక్షణ)



బైబై.. రేపటి నుంచి బడికి సెలవు



జరజర పోవల్ల.. లేకుంటే బస్సు మిస్ అయితాది.

అనంతపురం విద్య, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పండుగకు ముందే విద్యాలయాలు, బస్టాండ్ల వద్ద దసరా సందడి నెలకొంది. విద్యాలయాలకు ఈనెల 22నుంచి దసరా సెలవులు ప్రకటించడంతో నగరంలో ఉండి చదువుకుంటున్న వివిధ ప్రాంతాల విద్యార్థులు శనివారం నుంచే ఇంటిబాట పట్టారు. ఈ క్రమంలో సాయంత్రం విద్యాలయాలు, హాస్టళ్ల వద్ద స్నేహితులకు బైబై అంటూ వీడ్కోలు పలికి, హడావుడిగా బ్యాగులు సర్దుకుని తమ కోసం వచ్చిన వారితో కలిసి ఆనందంగా బస్టాండుకు బయల్దేరారు. పిల్లలను తీసుకెళ్లడానికి వచ్చిన తల్లిదండ్రులతో నగరంలోని పలు ప్రాంతాలు సందడిగా మారాయి. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ జాం అయ్యింది. ఆర్టీసీ బస్టాండ్ పిల్లలు, వారి తల్లిదండ్రులతో కిటకిటలాడింది. బస్సులలో సీట్లకోసం చాలామంది ఫీట్లు చేస్తూ కనిపించారు.



ఇదిగో.. ఈ బ్యాగు ఆ సీట్లో వెయ్యన్నా..



రేయ్.. పొయ్యొస్తాం రా



లే.. లే.. జాగ్రత్తరా ..! జారేవు..

పోటీలతో నైపుణ్యం మెరుగు

● జిల్లా విద్యాధికారి కిష్టప్ప



ప్రతిభ చాటిన విద్యార్థులతో జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్

కొత్తచెరువు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యాసరచన, వక్తృత్వపు పోటీల్లో పాల్గొనడం ద్వారా నైపుణ్యాలు మెరుగుపరచుకోవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కిష్టప్ప సూచించారు. జిల్లాలోని 12 పాఠశాలల నుంచి 22 మంది విద్యార్థుల బృందాలకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలను శనివారం ఆయా పాఠశాలల్లో నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో అగళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు హర్షియాబాను, దీక్షిత, సంజన మొదటి స్థానంలో నిలిచారని జిల్లా సైన్స్ అధికారి తనూజ్‌కుమార్ తెలిపారు. ముదిరెడ్డిపల్లి, సోమందేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు వరుసగా ద్వితీయ, త్రుతీయ స్థానాల్లో నిలిచారన్నారు. వ్యాసరచన పోటీల్లో కోరేవాండ్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వనజ, బిందుశ్రీ, హర్షిత్‌కుమార్ విజేతలుగా అవతరించారు. నిడిమామిడి జిల్లా పరిషత్, ధర్మవరంలోని శాంతి నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేత బృందాలు అగళి, కోరేవాండ్లపల్లికి చెందిన విద్యార్థులు అక్టోబరు 16 నుంచి నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఆ విద్యార్థులను డీఈఓ, సైన్స్ అధికారి, గైడ్ టీచర్లు షబ్బీర్, భాస్కర్, మస్తాన్ అభినందించారు.

సూక్ష్మ సేద్యానికి చేయూత

● జీఎస్టీ 5 శాతానికి తగ్గింపు



డ్రిప్ ఇరిగేషన్ యూనిట్

కొత్తచెరువు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం జీఎస్టీని తగ్గించిందని ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ శనివారం తెలిపారు. సూక్ష్మసేద్యం పరికరాలపై ఇదివరకు జీఎస్టీ 12.5 శాతం వసూలు చేసేవారు. ఇది రైతులకు భారంగా ఉండేది. క్షేత్రస్థాయిలో కూడా డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలకు సబ్సిడీ చెల్లించేందుకు ఇబ్బందులు పడేవారు. దీంతో డ్రిప్, స్ప్రింక్లర్ల పంటలసాగు తగ్గుముఖం పడుతుండటంతో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని 5 శాతానికి తగ్గించిందని ఆయన తెలిపారు.

భారం తగ్గిందిలా..

గతంలో హెక్టారుకు రాయితీ బిందుం సేద్యపరికరాలకు జీఎస్టీ 12.5 శాతం రైతులు చెల్లించాల్సి ఉండేది. దీంతో రైతు జీఎస్టీతో కలిపి హెక్టారుకు రూ.24వేల నుంచి రూ.28వేలు చెల్లించేవారు. కేంద్రప్రభుత్వం జీఎస్టీని 5 శాతానికి తగ్గించింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 2.5 శాతం జీఎస్టీని చెల్లించగా.. మిగిలిన 2.5 శాతం రైతు కట్టుకోవాలి. ఈ లెక్కన రైతు హెక్టారుకు జీఎస్టీ కింద రూ.12వేలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. దీంతో రైతులపై జీఎస్టీ భారం తగ్గింది.

డీఐజీ, జిల్లా న్యాయాధికారిని

కలిసిన ఎస్పీ

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిముషిని, జిల్లా న్యాయాధికారి భీమారావును నూతన ఎస్పీ సతీష్ కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛాలను అందజేశారు.





డీఐజీ షిముషికి, జిల్లా న్యాయాధికారి భీమారావుకు పుష్పగుచ్ఛాన్ని ఇస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

రక్త నమూనాలను ప్రభుత్వ ఆస్పత్రికి పంపాలి

ప్రైవేటు ఆస్పత్రులకు డీఎంహెచ్ఓ సూచన

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): డెంగీ నిర్ధారణ కోసం సేకరించిన రక్త నమూనాలను ప్రభుత్వ ఆసుపత్రి మైక్రో బయాలజీ ల్యాబ్‌కు పంపాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు సూచించారు. జిల్లా మలేరియా అధికారి ఓబులు అధ్యక్షతన మలేరియా సబ్ యూనిట్ అధికారుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. జ్వరంతో వచ్చే రోగుల నుంచి సీరం శాంపిల్స్‌ను సేకరించి, డెంగీ నిర్ధారణ కోసం ఎలిసా పద్ధతిలో పరీక్షలు చేయాలని డీఎంహెచ్ఓ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎలిసా పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అన్ని ల్యాబ్‌ల టెక్నీషియన్స్‌తో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి, సబ్ యూనిట్ అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఏఓ గిరిజ మనోహర్‌రావు, డాక్టర్లు యుగంధర్, విష్ణుమూర్తి, నరేంద్రరెడ్డి, ఎస్ఓ మహ్మద్ రఫీ, హెచ్ఈఈఓ నాగరాజు, డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధన అధికారి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి

● నమో యువ రన్‌లో బీజేపీ నేతలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బంగారు భవితను సర్వనాశనం చేస్తున్న మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవాపక్షోత్సవాల్లో భాగంగా శనివారం బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో నమో యువరన్ నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి సప్తగిరి సర్కిల్ ప్రదర్శన నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్, మద్యపానానికి దూరంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి యువతకు సూచించారు. వైసీపీ హయాంలో దేశంలో ఎక్కడ మాదకద్రవ్యాలు పట్టుబడినా మూలాలు ఏపీలో ఉండేవని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి, కార్యదర్శి నందిరెడ్డి శ్రీనివాసులు, నాయకులు చిరంజీవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీకి హాజరైన బీజేపీ నాయకులు, యువత

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం: కలెక్టర్ ఆనంద్



మహిళలకు మొక్కలు అందజేస్తున్న కలెక్టర్

గార్లదిన్నె, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు పాటుపడాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టర్ ఆనంద్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహర్ గార్లదిన్నెలో పర్యటించారు. జంబులదిన్నె గ్రామ సమీపంలో రైతు గిర్రెడ్డి సాగుచేసిన మామిడి తోటను, నీటి కుంటను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. మండలవ్యాప్తంగా పండ్లతోటలు సాగు చేస్తున్నామనీ, తెగుళ్లకు మందులు పిచికారీ చేసేందుకు రాయితీతో డ్రోన్లు ఇవ్వాలని రైతులు కోరారు. అనంతపురం మార్కెట్‌లో చీనీ విక్రయాల్లో రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని రైతులు వాపోయారు. మార్కెట్ నిర్వాహకులు, వ్యాపారులు కుమ్మక్కై రైతులకు నష్టం వచ్చేలా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ... రైతు సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందని చర్చించారు. పండ్లతోటలను రైతులు విరివిగా సాగు చేయాలన్నారు. ఉద్యాన పంటలతోనే రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. బస్టాండ్ సర్కిల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ఏర్పాటు చేసిన మానవహారంలో పాల్గొని, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం శివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మహిళలకు మొక్కలు అందజేశారు. స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, ఆర్డీఓ కేశవనాయుడు, డ్వామా పీడీ సలీం బాషా, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, స్వచ్ఛ భారత్ కార్పొరేషన్ డైరెక్టర్ భవానీప్రసాద్, జడ్పీ సీఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజనాయుడు, డీసీ చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల కృష్ణా, గేటు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

స్మార్ట్ రైస్ కార్డులను ఇంటి వద్దకే వెళ్లి ఇవ్వండి: జేసీ

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రైస్ కార్డులను ఇళ్ల వద్దకే వెళ్లి కార్డుదారులకు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ ఆదేశించారు. చౌక ధరల దుకాణాల వద్ద పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులొస్తున్నాయని ఆయన తెలిపారు. సచివాలయ సిబ్బంది నేరుగా ఇళ్లకు వెళ్లి ఇవ్వాలని సూచించారు. జిల్లాలో 6,57,828 స్మార్ట్ రైస్ కార్డుదారులకు ఈ నెల 15 నుంచి పంపిణీ చేస్తున్నామని జేసీ తెలిపారు. ఇప్పటివరకు 3,34,214 మందికి పంపిణీ చేశామని అన్నారు. క్యూ ఆర్ కోడ్ కలిగిన ఈ స్మార్ట్ రైస్ కార్డులను చౌకధరల దుకాణాలకు మ్యాపింగ్ చేసి.. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దకే పంపుతామని తెలిపారు. పంపిణీ సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తితే, వాటిని పరిష్కరించి కార్డుదారుల ఇంటి వద్దే పంపిణీ చేయాలని సూచించారు. కార్డుదారులను ఒకచోటకు పిలపించి ఇవ్వవద్దని హెచ్చరించారు. తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, సీఎస్‌డీటీలు సచివాలయ సిబ్బంది ద్వారా కార్డుదారుల బయోమెట్రిక్ తీసుకుని, ఇంటి వద్దనే పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



పుట్టపర్తి మండలం చెర్లోపల్లి వద్ద పాక్షికంగా పూడ్చేసిన ఫాంపాండ్

● లోపించిన పర్యవేక్షణ

ఫాంపాండ్లను పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ప్రతి ఫాంపాండ్ స్థలాన్ని జియోట్యాగ్‌చేసి సీజన్ తర్వాత డోన్ సర్వేతో నీటినిల్వ ఉందో లేదా చూడాలి. వర్షాకాలం తర్వాత నిజంగా ఫాంపాండ్‌లో నీరు నిల్వ ఉందని నిర్ధారించిన తర్వాతనే సబ్సిడీ చెల్లించాలి. నకిలీ బిల్లులు వేస్తే భూ అభివృద్ధి చట్టాల కింద కేసులు నమోదు చేయాలి. కాని భూమి దాహం తీర్చి రైతులకు మేలు చేయాలన్న లక్ష్యంతో రూపొందించిన పథకాన్ని సంబంధిత అధికారులు అపహాస్యం చేస్తున్నారనే విమర్శలు మూటగట్టుకుంటున్నారు.

నిధులు తవ్వుకుని..

ఫాంపాండ్లను పూడుస్తున్న కొందరు

ప్రభుత్వ ఆశయానికి తూట్లు

పట్టించుకోని అధికారులు



చెర్లోపల్లి సమీపంలో ఫాంపాండ్‌ను రాళ్లతో నింపిన దృశ్యం

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నిధుల కోసమో, లేక అవకాశం వచ్చింది కదా అని ఫాంపాండ్ తవ్వారు. బిల్లులు చేతికందగానే అవసరం తీరింది కదా అని వాటిని పూడ్చేస్తున్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంచడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫాంపాండ్ల తవ్వకాన్ని ప్రోత్సహించాయి. ప్రభుత్వం నుంచి నిధులు వస్తాయనే ఆలోచనతో అప్పట్లో చాలా మంది రైతులు ఫాంపాండ్లను తవ్వించారు. ఇదే అదనుగా అప్పటి అధికారపార్టీ నాయకులు అధికారులతో కుమ్మక్కై ఎక్కడబడితే అక్కడ తవ్వుకుని బిల్లులు చేసుకుతిన్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ఆ ఫాంపాండ్లతో పని లేదనుకున్నారో ఏమో కొందరు వాటిని పూడ్చే పనిలో నిమగ్నమయ్యారు. ఇదీ... ప్రభుత్వం ఎంతో సమున్నత లక్ష్యంతో ప్రారంభించిన ఫాంపాండ్ల కథా కమామిషు. మండలంలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలో ప్రధాన రహదారి పక్కనే మూడేళ్ల కిందట ఫాం పాండ్లను తవ్వారు. అదీ వందమీటర్ల పరిధిలో ఒకే వ్యక్తికి చెందిన పొలంలో ఆయన కుటుంబసభ్యుల పేర్లతో మూడు ఫారంపాండ్లకు అనుమతులు తెచ్చుకుని, తవ్వించుకున్నాడు. పీఎంకేఎస్‌వై నిధులతో ఒక్కో ఫాంపాండ్ 50మీటర్లు పొడవు, 20మీటర్ల వెడల్పు 2మీటర్ల లోతుతో తవ్వారు. అప్పటి అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో అధికారులు కూడా ఒక్కో ఫాంపాండ్‌కు రూ.లక్ష బిల్లులు త్వరగానే మంజూరు చేసినట్లు తెలిసింది. ఇక ఇప్పుడు కాలం గడిచిందని ఆ వ్యక్తి ఫాంపాండ్లను పూడ్చేపనిలో నిమగ్నమయ్యారు.

షోకాజ్ నోటీస్ ఇస్తాం



భూగర్భ జలాలను పెంచి తద్వారా రైతుకు లాభం చేకూర్చాలన్న లక్ష్యంతో నిర్మించిన ఫాంపాండ్లను పూడ్చిన రైతులకు షోకాజ్ నోటీసులను జారీ చేస్తాం. ఫాంపాండ్ తవ్వకానికి మంజూరు చేసిన నిధులను రికవరీ చేస్తాం.

- విజయేంద్రప్రసాద్, డ్వామా పీడీ

క్రైం కార్నర్

అత్తింటివారిపై కేసులు

అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని..

కూడేరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో శనివారం ఒకే రోజు రెండు అదనపు కట్నం వేధింపుల కేసులు నమోదయ్యాయి. కమ్మూరు గ్రామానికి చెందిన శైలజను అదనపు కట్నం కోసం భర్త, అత్త మామలు వేధింస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. శైలజకు గార్లదిన్నె మండలం కనుంపల్లి గ్రామానికి చెందిన అనిల్ కుమార్‌తో ఆరు నెలల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో ఆరు తులాల బంగారం కట్నంగా ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదనపు కట్నం కావాలని నిత్యం వేధిస్తున్నారని శైలజ పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఆమె భర్త అనిల్ కుమార్, అత్త రమాదేవి, మామ జగన్నాథ్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఇదే తరహాలో చోళసముద్రం గ్రామానికి చెందిన వనిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె భర్త పురుషోత్తం, అత్త లక్ష్మీదేవి, మామ చిదంబరప్పపై పోలీసులు కేసు నమోదు చేశారు. వనితకు గార్లదిన్నె మండలం పెనకచెర్లకు చెంది పురుషోత్తంతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. పురుషోత్తం ఉద్యోగ రీత్యా ఢిల్లీలో ఉండటంతో అక్కడే కాపురం పెట్టారు. అదనపు కట్నం కావాలని తనను నిత్యం వేధిస్తున్నారని వనిత ఫిర్యాదు చేశారు.

ప్రాణం తీసిన టిప్పర్


శ్రీకాంత్ (ఫైల్)

రాప్తాడు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొందిరెడ్డిపల్లి వద్ద టిప్పర్ కింద పడి శ్రీకాంత్(28) అనే యువ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు, రామినేపల్లికి చెందిన శ్రీకాంత్ కనగానపల్లి వద్ద రెండు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని టమోటా సాగు చేశాడు. టమోటా పంటకు పురుగుల మందు పిచికారీ చేసి, బైక్‌పై తిరిగి వస్తుండగా గొందిరెడ్డిపల్లి వద్ద టిప్పర్ ఎదురుగా వచ్చింది. దీంతో బైక్‌ను శ్రీకాంత్ రోడ్డు పక్కకు తీసి ఆగాడు. టిప్పర్ ముందు భాగం వెళ్లిన తరువాత వెనుక భాగం బైక్ హ్యాండిల్‌కు తగులుకుంది. దీంతో శ్రీకాంత్ అదుపు తప్పి టిప్పర్ చక్రాల కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శ్రీకాంత్ కుటుంబ సభ్యులు ప్రమాద స్థలానికి చేరకుని బోరున విలపించారు. శ్రీకాంత్ మృతదేహాన్ని పోలీసులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాప్తాడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన తల్లీబిడ్డలు సేఫ్

- హైదరాబాద్‌లో గుర్తించి తీసుకువచ్చిన పోలీసులు



హైదరాబాదులో మాధవి, ఆమె పిల్లలతో గుత్తి పోలీసులు

గుత్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి ఇద్దరు పిల్లలతో వెళ్లిపోయిన మహిళను హైదరాబాదులో గుత్తి పోలీసులు గుర్తించి, తిరిగి తీసుకువచ్చారు. పట్టణంలోని గాంధీ నగర్‌కు చెందిన మాధవి తన పిల్లలు సిద్ధార్థ్, భానుశ్రీతో కలిసి జూలై 18న బాట సుంకులమ్మ ఆలయానికి వెళ్లారు. ఆ తరువాత ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆమె తల్లిదండ్రులు సుంకరత్నమ్మ, వెంకటరాముడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు, వారు హైదరాబాదులోని యూసఫ్ గూడలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడి పోలీసు స్టేషన్‌లో రికార్డు చేయించి గుత్తికి తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తన భర్త శ్రీనివాసులు కార్పెంటరు పనికి వెళ్లడం లేదని, దీంతో పిల్లల పోషణ భారం కావడంతో అతనితో విభేదించి ఇంటి నుంచి వెళ్లిపోయానని మాధవి తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


కాయల ఆదెప్ప

శింగనమల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సి.బండ మీదపల్లి గ్రామానికి చెందిన కాయల ఆదెప్ప అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. సి.బండమీదపల్లికి చెందిన ఆదెప్ప ఇంట్లో గొడవపడి రెండు రోజుల క్రితం వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు శింగనమల పోలీసు స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు అలవాటు పడిన ఓ వ్యక్తి డబ్బు కోసం బైక్ దొంగతనాలను ప్రారంభించాడు. వాటిని అమ్మగా వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసుకుంటున్నాడు. నిఘా వేసిన అనంతపురం వన్‌టౌన్ పోలీసులు, గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన రమణ(35) అనే వ్యక్తిని అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ.2.30 లక్షల విలువ చేసే 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు శనివారం విలేకరులకు తెలియజేశారు.

గుత్తి చెరువులో డెవిల్ ఫిష్

గుత్తి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించే డెవిల్ ఫిష్ గుత్తి చెరువులో తారసపడింది. ఈ చేప మత్స్యకారుల వలకు శనివారం చిక్కింది. ఆర్మర్డ్ సెయిల్ ఫిన్ క్యాట్ ఫిష్‌గా పేర్కొనే ఈ చేప నీటి వనరులలో దురాక్రమణదారుగా పేరొందింది. తూర్పు కనుమలలోని 65 శాతం నీటివనరులలో ఈ చేప కనిపించడం ఆందోళన కలిగించే అంశం. ఈ చేప ఎక్కడున్నా మిగిలిన చేపలను వేటాడి తినేస్తుంది. వాటి మనుగడకు ముప్పు కలిగిస్తుంది. ఈ చేపను ఆహారంగా తీసుకోరని, వలలో చిక్కితే బయట పడేస్తామని మత్స్యకారులు ఓబులేసు, పురుషోత్తం, బాలకృష్ణ తెలిపారు.


గుత్తి చెరువులో చిక్కిన డెవిల్ ఫిష్‌ను చూపుతున్న మత్స్యకారుడు ఓబులేసు

22న విడుదల..!

(5వ పేజీ తరువాయి)

తగ్గుతాయి. దీనికితోడు దసరా పండుగకు పదిరోజుల ముందే ఈనెల 22వ తేదీ నుంచి ఈ ధరలు అమల్లోకి రానున్నాయి. దీంతో తగ్గిన అనంతరం వాహనాలను కొనడానికి ఆసక్తి చూపుతున్నారు.

ఆఫర్ ఇచ్చినా... కొనుగోలుపై అనాసక్తి

జీఎస్టీ తగ్గింపుతో అందరిచూపు ఈనెల 22పైనే ఉంది. దీంతో కేంద్ర ప్రభుత్వం ప్రకటన ఇచ్చినప్పటి నుంచి అంటే గత నెలాఖరు నుంచి వినియోగదారులు వాహనాల ధరల తగ్గింపు కోసం వేచిచూస్తున్నారు. జీఎస్టీ తగ్గింపుతో ఇప్పుడే అవే ధరలు ఇస్తాం... కొనుగోలు చేయండి అంటూ సేల్స్‌మెన్, మేనేజర్లు చెబుతున్నా వారు ససేమిరా అంటున్నారు. ఇలా ఆఫర్ ఇచ్చినా ఆసక్తి చూపకపోవడంతో వాహనాల షోరూంల నిర్వాహకులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. 'ఇప్పుడు వద్దులే బాబు... కొత్త పన్నులు అమలయ్యాకే తీసుకుంటాం' అని స్పష్టం చేస్తున్నారు. కొత్త ధరలు వచ్చాక లైఫ్ టాక్స్ తగ్గుతుందని భావిస్తుండటంతో కొనడానికి ఆసక్తి చూపట్లేదని తెలుస్తోంది.

తగ్గనున్న బైక్‌ల ధరలిలా..

మోడల్	పాత ధర	కొత్త ధర	ధర తేడా
హోండా యాక్టివా	84,173	77,238	6,935
షైన్	87,189	80,100	7,089
యూనికార్న్	1,19,327	1,09,500	9,827
సీటీ 100	70,000	62,000	8,000
పల్సర్ 125	86,000	80,000	6,000
పల్సర్ 150	1,12,000	1,03,000	9,000



కియ షోరూం

పడిపోయిన బైక్‌లు, కార్ల అమ్మకాలు

జీఎస్టీ కొత్త విధానంలో బైక్‌లు, కార్ల కొనుగోలుపై తీవ్ర ప్రభావం చూపింది. అమ్మకాలు భారీగా తగ్గాయి. ప్రతినెలా 200 వాహనాలు అమ్మే ఓ బైక్ షోరూంలో ఈ నెలలో ఇప్పటి వరకు 45 వాహనాలు మాత్రమే విక్రయించామని చెబుతున్నారు. ఈ 20 రోజులలో 25 శాతం మాత్రమే అమ్మకాలు జరిగాయని శివ్‌సాయి హోండా మేనేజర్ శేషాద్రి తెలిపారు. మరో కంపెనీ షోరూంలో 100 నుంచి 120వరకు విక్రయిస్తుండగా.. అవి 30కే పరిమితమయ్యాయి. 130 నుంచి 150 వరకు బైక్‌ల అమ్మకాలు జరిగే మరో షోరూంలో 40వాహనాలు మాత్రమే సేల్ అయ్యాయి. కార్ల విషయంలో ఓ షోరూంలో ప్రతినెలా 80వరకు విక్రయించేవారు. ఈ నెలలో మాత్రం ఇప్పటి వరకు 6 మాత్రమే విక్రయించారు. ప్రతినెలా ఈ సమయానికి 40 నుంచి 45 వాహనాలు సేల్ చేసేవారమనీ, ఈసారి 15శాతం మాత్రమే జరిగిందని మహీంద్రా మేనేజర్ మస్తాన్ తెలిపారు. జీఎస్టీ ప్రభావంతో ఈసారి అమ్మకాలు తగ్గాయనీ, 22 నుంచి పెరుగుతాయని ఆశిస్తున్నామని కియ సేల్స్ హెచ్‌ఓడీ ఎల్లప్ప చెప్పారు.

350 సీసీలోపు బైక్‌లపై తగ్గింపు ఇలా...

బైక్‌లకు సంబంధించి 350 సీసీలోపు మోటారు సైకిళ్ల ధరలు తగ్గుతాయి. వీటిపై 28 నుంచి జీఎస్టీ 18శాతానికి తగ్గనుంది. రాయల్ ఎన్‌ఫీల్డ్, కేటీఎం వంటి 350 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం బైక్‌ల ధరలు పెరగనున్నాయి. వీటిపై ఇదివరకు 28 శాతం జీఎస్టీతోపాటు సెస్ విధించేవారు. ఇకపై సెస్ లేకుండా 40శాతం జీఎస్టీ పన్ను పరిధిలోకి వెళ్తాయి.

కార్ల ధరలు ఎలా ఉంటాయంటే...

తగ్గనున్న కార్ల ధరలిలా..

మోడల్	పాత ధర	కొత్త ధర	తేడా
బొలెరో	10,92,600	9,78,000	1,14,300
స్కార్పియో	23,44,001	22,11,701	1,32,300
థార్ రాక్స్	23,38,799	22,05,999	1,33,000
ఎక్స్‌యూవీ3ఎక్స్‌ఓ ఏఎక్స్7ఎల్ టీజీడీ	15,79,501	14,39,800	1,39,701
సెల్టోస్(పెట్రోల్)	11,18,900	10,79,275	36,625
సోనెట్	7,79,900	7,30,137	49,763

కార్ల విషయంలోనూ 28 నుంచి 18 శాతానికి తగ్గించారు. ఎలక్ట్రికల్ కార్లపై ప్రస్తుతం 5శాతం పన్ను విధిస్తున్నారు. ఈ రేటులో ఎలాంటి మార్పు ఉండదు. వీటిలో రూ.50వేల నుంచి రూ.1.90లక్షల వరకు తగ్గనున్నాయి. కియ కార్నివాల్ మోడల్ విషయంలో రూ.4.48లక్షలు తగ్గనుంది.

అమ్మకాలు పెరుగుతాయని ఆశిస్తున్నాం



గతంతో పోల్చితే ఈ నెలలో అమ్మకాలు తగ్గాయి. జీఎస్టీ తగ్గింపే ఇందుకు కారణమని భావిస్తున్నాం. 22 తరువాత అమ్మకాలు మరింత పెరుగుతాయని ఆశిస్తున్నాం. వాహనాల ధరను బట్టి షోరూంలో రూ.7వేల నుంచి రూ.15వేల వరకు తగ్గే అవకాశం ఉంది.

శేషాద్రి, శివ్‌సాయి హోండా మేనేజర్

అమ్మకాలపై ప్రభావం



జీఎస్టీ తగ్గింపు ప్రభావం అమ్మకాలపై పడింది. ఇది వరకు ప్రతినెలా 20వతేదీ వరకు 45 వాహనాలు అమ్ముడయ్యేవి. ఈనెల 15శాతం మించలేదు. ఈ షో రూంలో మహీంద్ర వాహనాల్లో రూ.53 వేల నుంచి రూ.1,90 ,000 వరకు తగ్గింపు రానుంది. 22 నుంచి అమ్మకాలు పెరుగుతాయని భావిస్తున్నాం.

- మస్తాన్, మహీంద్రా మేనేజర్

ఆటోల ధరలూ తగ్గనున్నాయి



జీఎస్టీ విధానంతో ఆటో ధరల్లోనూ మార్పులు రానున్నాయి. ఆటోలకైతే రూ.20 వేల వరకు, బొలెరో పికప్ లాంటి వాహనాలకైతే రూ.94వేల వరకు తేడా ఉండనుంది.

- కేశవ, జనరల్ మేనేజర్, మహీంద్రా ఆటోమొబైల్

ఈ నెల బాగా తగ్గాయి



జీఎస్టీ ప్రభావంతోనే ఈ నెలలో అమ్మకాలు తగ్గాయి. 15 నుంచి 20శాతమే విక్రయిలు జరిగాయి. ఎక్స్ షోరూం ధరపై మోడల్‌ను బట్టి రూ.8వేల నుంచి రూ.15వేల వరకు తగ్గనున్నాయి. ఈ వారం నుంచి అమ్మకాలు పెరుగుతాయని ఆశిస్తున్నాం.

- నాగరాజు, బజాజ్ మేనేజర్

బాగా తగ్గింది



ఎప్పటిలాగే దసరా సమయంలో అమ్మకాలు ఉంటాయనుకున్నాం. జీఎస్టీ కొత్త విధానం అమలుతో వినియోగదారులు ఆసక్తి చూపడం లేదు. వాహన ధరలు రూ.36వేల నుంచి రూ.1.85 లక్షల వరకు తగ్గనున్నాయి. కార్నివాల్ ధర రూ.4.48 లక్షల వరకు తగ్గనుంది.

- ఎల్లప్ప, కియ సేల్స్ హెచ్‌ఓడీ

ఆరుగురికి ఎంపీడీఓలుగా ప్రమోషన్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి జిల్లాలో ఏఓలుగా ఉన్న ఆరుగురికి డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈమేరకు వారికి ప్లేస్‌మెంట్స్ కూడా ఖరారు చేస్తు జడ్పీ చైర్‌పర్సన్ చేతులమీదుగా సీఈఓ శివశంకర్ ఉత్తర్వులు శనివారం జారీ చేశారు.

ఉద్యోగి పేరు	ఎంపీడీఓగా కేటాయించిన స్థానం
జయరాములు	గుమ్మఘట్ట
శ్రీనివాసులు	అమడగూరు
ఆనంద్‌ప్రసాద్	రొద్దం
శకుంతల	ముదిగుబ్బ
కమలాబాయి	గోరంట్ల
మాధవి	కుందుర్పి

పరీక్ష ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న జేఎన్‌టీయూఏ పరీక్షల విభాగం అధికారులు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ పరిధిలో జూన్, జూలై, ఆగస్టు నెలల్లో జరిగిన బీఫార్మసీ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, ఒకటో సెమిస్టర్ సప్లిమెంటరీ, ఫార్మడీ రెండో సంవత్సరం రెగ్యులర్, సప్లిమెంటరీ, ఫార్మడీ రెండో సంవత్సరం సప్లిమెంటరీ, ఐదో సంవత్సరం అడ్వాన్స్ సప్లిమెంటరీ, ఎమ్మెస్సీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ, ఒకటో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలు పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. జేఎన్‌టీయూఏ పరీక్షల విభాగం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుషన్ ఆచార్య నాగప్రసాద్ నాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినేషన్ ఆచార్య శివకుమార్, అడిషినల్ కంట్రోలర్ శంకరశేఖర్‌రాజు, డా. శ్రీధర్ ఫలితాలను శనివారం ప్రకటించారు. జేఎన్‌టీయూఏ వెబ్ సైట్‌లో ఫలితాలు చూసుకోవచ్చని వర్సిటీ అధికారులు తెలిపారు.

టమోటా రూ.22.. చీనీ రూ.16 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.22 కనిష్ఠ ధర రూ.14, సరాసరి ధర రూ.17 పలికాయి. యార్డుకు శనివారం 2250 టన్నుల టమోటాలు వచ్చాయని రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధరరూ.12వేలు పలికాయని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో తల్లీబిడ్డల మృతి


తల్లీబిడ్డల మృతదేహాలు

పావగడ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో తల్లి, తన ఇద్దరు బిడ్డలకు ఉరివేసి తాను కూడా ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన తాలూకా పరిధిలోని కడపలకెరె గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. సరిత(28) అదే గ్రామానికి చెందిన సంతోష్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల రిష్విక్ యాదవ్, రెండేళ్ల యుక్తి ఉన్నారు. కుటుంబ కలహాలతో తరచూ గొడవపడేవారని స్థానికులు తెలిపారు. శనివారం సాయంత్రం ఏం జరిగిందో కానీ ఎవరూ లేని సమయంలో తన ఇద్దరు పిల్లలకు ఉరివేసి తాను ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు భర్త సంతోష్ తెలుపడంతో సరిత తల్లి శాంతమ్మ, తండ్రి ఓబిరెడ్డి కన్నీటి పర్యంతమయ్యారు. అయితే తన కుమార్తె అలాంటిదికాదని ఇది అనుమానాస్పద మృతి అని మృతికి కారణమైన వారిపై కేసు నమోదుచేసేంతవరకు మృతదేహాలను తాకనీయమని కుటుంబికులు భీష్మించారు. ఘటనా స్థలానికి డీవైఎస్పీ మంజునాథ్ చేరుకుని సంఘటన వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన తరువాతే హంతకులెవరనేది, తేలుతుందని నచ్చచెప్పడంతో మృతదేహాలను పావగడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు వారు ఒప్పుకున్నారు.

ప్రపంచం గర్వించే స్థాయికి పట్టు ఎగుమతులు

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



సీఎస్‌బీ వార్షికోత్సవాలలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టు ఎగుమతుల్లో భారత్ ప్రపంచం గర్వించే స్థాయికి ఎదిగిందని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సెంట్రల్ సిల్క్ బోర్డు(సీఎస్‌బీ) 76వ వ్యవస్థాపక వేడుకలు బెంగళూరులోని డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎంపీ అంబికా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టు పరిశ్రమ అభివృద్ధిలో సీఎస్‌బీ 75 ఏళ్లుగా నిర్విరామంగా సేవలు అందిస్తోందన్నారు. పట్టు ఎగుమతులు రూ.3 లక్షలు నుంచి రూ.2356 కోట్లకు పెరగడం గర్వకారణమని తెలిపారు. ఏపీ రైతుల సంక్షేమం దృష్ట్యా పట్టుగుళ్లకు గతంలో ఇచ్చిన ప్రోత్సాహకాన్ని మళ్లీ ప్రారంభించాలని ఆయన కేంద్రాన్ని కోరారు. సిల్క్‌సమగ్ర పథకం కింద షెడ్ల నిర్మాణానికి అందించే ఆర్థిక సాయం రూ.12 లక్షలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ సుధాకర్, టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ పద్మిని సింగ్లా, సీఎస్‌బీ మెంబర్ సెక్రెటరీ శివకుమార్, దేశవ్యాప్తంగా పట్టు రైతులు, నేతన్నలు, శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

'సొసైటీలను ఉద్యానవనాల్లా మారుస్తాం'


మొక్కలు నాటుతున్న డీసీఎం అరుణకుమారి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని సొసైటీ కార్యాలయాల వద్ద విరివిగా మొక్కలు నాటి ఉద్యానవనంలా మారుస్తామని జిల్లా సహకార శాఖ అధికారి అరుణకుమారి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు తెలిపారు. స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కమలానగర్‌లో ఉన్న డీసీఎంఎస్ కార్యాలయం వద్ద వారు పరిసరాలను శుభ్రం చేసి, మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే అనే నినాదంతో మొక్కలు నాటి పర్యావరణ కాలుష్యాన్ని నివారించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ విజయభాస్కర్, అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, జిల్లా సహకార శాఖ కార్యాలయం సూపరింటెండెంట్ మునికృష్ణారెడ్డి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా లఘుచిత్రాల ప్రదర్శన

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): భాషా, సాహిత్యం, కళలు, ఇతర ఆచారాలను గౌరవించడం ద్వారానే తెలుగు వికాసం, సంస్కృతి రక్షించబడుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. గుంటూరు భారతీయ విద్యా భవన్‌లో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు 2026 సన్నాహాల్లో భాగంగా శనివారం తెలుగు భాషా వికాసంపై ఎంపిక చేసిన 44 లఘు చిత్రాల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్టీఆర్ తన చిత్రాల ద్వారా భాష ఉన్నతికి కృషి చేశారని, ఆయన అడుగుజాడల్లో పయనించాలన్నారు. మాజీ ఎంపీ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాదు మాట్లాడుతూ జాతి అస్తిత్వానికి మాతృభాష కొలమానమని అన్నారు. గ్రాంథిక భాష నుంచి వ్యవహారిక భాష ప్రాధాన్యతను గుర్తించి దాని అభివృద్ధికి విశేషంగా కృషిచేసిన గిడుగు రామ్మూర్తి తెలుగు భాషోద్యమ పితామహుడు అని కొనియాడారు. తూర్పు ఎమ్మెల్యే నజీర్ మాట్లాడుతూ ప్రత్యేక మంత్రిత్వ శాఖ ద్వారా తెలుగు భాషా వికాసానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు పొడపాటి తేజస్విని మాట్లాడుతూ వేమన, సుమతి శతకాలు ద్వారా తెలుగు భాష మాధుర్యాన్ని రుచి చూస్తారన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఆంధ్ర సారస్వత పరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరిలో జరుగనున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు చరిత్రలో చిరస్థాయిగా మిగిలేలా కృషి చేస్తున్నట్టు వివరించారు. అనంతరం ప్రదర్శించిన లఘుచిత్రాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా గిడుగు రామ్మూర్తి పంతులుపై కొత్తపల్లి సీతారాం నిర్మించి దర్శకత్వం వహించిన కృత్రిమ మేధస్సుతో రూపొందించిన 'తెలుగు వెలుగు గొడుగు గిడుగు" లఘు చిత్రం విశేషంగా ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో వివిఐటి విసి వాసిరెడ్డి విద్యాసాగర్, బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ బుచ్చిరాంప్రసాద్, సినీ ప్రముఖులు దశరథ్, కోన వెంకట్, డివై చౌదరి, బివిఎస్ రవి తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్ సవీరాలో మృతదేహానికి వైద్యం..?

- అర్ధరాత్రి మృతురాలి బంధువుల ఆందోళన
- రూ.రెండు లక్షల బిల్లు చెల్లించిన బాధితులు
- పెండింగ్ బిల్లు కోసం ఆస్పత్రి వర్గాల డిమాండ్
- కేసు నమోదుకు పోలీసులు ససేమిరా

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మృతదేహానికి వైద్యం చేసి, బిల్లులు వేశారని ఆరోపిస్తూ ధర్మవరం పట్టణానికి చెందిన బాధితులు నగరంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రి వద్ద శనివారం రాత్రి ఆందోళనకు దిగారు. అనారోగ్యంతో కిమ్స్ సవీరా ఆస్పత్రిలో చేరిన పార్వతి(39) చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతురాలి బంధువులు జయకృష్ణ, గాయత్రి తెలిపిన మేరకు, ధర్మవరం పట్టణానికి చెందిన పార్వతి అనారోగ్యంతో బాధపడుతుండటంతో గురువారం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శుక్రవారం రాత్రి కిమ్స్ సవీరా ఆస్పత్రికి


పార్వతి (ఫైల్)

తరలించారు. డాక్టర్లు అడ్మిట్ చేసుకుని, వైద్యం చేస్తున్నామని మెడిసిన్, ఐసీయూ పేరుతో రూ.2 లక్షల వరకు బిల్లు వసూలు చేశారు. ఆపై ఆస్పత్రి బిల్లు భరించే శక్తిలేకపోవడంతో వేరే ఆస్పతికి వెళ్తామని పార్వతి బంధువులు డాక్టర్లను శనివారం అడిగారు. దీంతో వారు వెంటిలేటర్‌పై తీసుకెళ్లాలని సూచించి.. పార్వతి మృతదేహాన్ని అప్పగించారు. కానీ పెండింగ్ బిల్లు చెల్లించాకే వెళ్లాలని సూచించారు. పార్వతి శుక్రవారం రాత్రే మృతి చెందినట్లు బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయిద్దామంటే ఆస్పత్రి వారు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులను పిలిపించి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లాలని బెదిరిస్తున్నారని వాపోయారు. 'అర్ధరాత్రి అయినా ఇక్కడే ఉన్నాము. పోస్టుమార్టం చేసి మాకు న్యాయం చేయాలి. అప్పటి వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదు' అని వారు భీష్మించారు. ఈ వివాదంపై ఆస్పత్రి పర్యవేక్షణ సిబ్బందిని వివరణ కోరగా.. తీవ్ర అనారోగ్యంతో పార్వతి మృతి చెందారని అన్నారు. పోస్టుమార్టం కావాలంటే డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేయాలని సీఐ జగదీష్ సూచించారు. అప్పటి వరకూ బాధితుల నుంచి కేసు తీసుకునే ఆస్కారం లేదని అన్నారు.


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

జగన్‌కు తెలిసింది కూల్చివేతలే..

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్



స్మార్ట్ రైస్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌కు కూల్చివేతలు తప్ప... నిర్మించడం తెలియదంటూ అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఎద్దేవా చేశారు. నగరంలోని 47వ డివిజన్‌లో గల రంగస్వామినగర్‌లో శనివారం నిర్వహించిన స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీలో ఆయన టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు అందించారు. అనంతరం మాట్లాడుతూ... నగరంలో 71,867 రేషన్ కార్డుదారులు ఉండగా, ఇప్పటి వరకూ 45 శాతం మందికి పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారికి నెలాఖరులోగా అందజేస్తామన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఎక్కడా అవినీతికి తావు లేకుండా ఒక విజన్‌తో ముందుకెళ్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మెడికల్ కాలేజీల నిధులను సైతం పక్కదారి పట్టించిందని ఆరోపించారు. ఎక్కడికక్కడ ఆ కాలేజీల భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయన్నారు. జగన్‌కు కూల్చడం తప్ప నిర్మించడం తెలియదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికుమార్, పార్లమెంట్ అంగన్వాడీ అధ్యక్షురాలు దలవాయి రమాదేవి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దలవాయి వెంకటనారాయణ, టీడీపీ నాయకులు నరేంద్ర చౌదరి, సింగవరం రవి, దాడి శ్రీనివాసులు, చేపలహరి తదితరులు పాల్గొన్నారు.

మహేష్ కుటుంబానికి అండగా ఉంటాం

అనంతపురం టౌన్: కాకినాడలో ప్రమాదవశాత్తు మృతి చెందిన అనంతపురం వాసి మహేష్ కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. నగరంలో శాంతినగర్ బోర్డు సమీపంలోని వెంకటరమణస్వామి బోర్‌వెల్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఆయన మహేష్ కుటుంబ సభ్యులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.3లక్షల ఆర్థికసాయంను చెక్కు రూపంలో అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. అలాగే బోర్‌వెల్స్ అసోసియేషన్‌కు ప్రత్యేక స్థలాన్ని కేటాయించేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, వెంకటరమణ బోర్‌వెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దమారెప్ప, ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పుట్టపర్తి ఎమ్మెల్యే



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పల్లె రఘునాథరెడ్డి, సింధూర తదితరులు

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆనంద్‌ను పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కేరళ రిటైర్డ్ డీజీపీ శంకర్‌రెడ్డి, పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పల్లె కిషోర్‌రెడ్డి శనివారం కలిశారు. కలెక్టరేట్‌లోని చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తూ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్‌ను కోరారు.

కాంగ్రెస్ నాయకులు కూడా..

అనంతపురం వైద్యం: కలెక్టర్ ఆనంద్‌ను కాంగ్రెస్ రాష్ట్ర అధికారి ప్రతినిధి శంకర్ యాదవ్ కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సుపరిపాలన ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీనియర్ నాయకులు వాసు, రహిమాన్, శర్మస్‌వలి, యూసఫ్, మోహిద్దీన్ పాల్గొన్నారు.

అలాగే గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ కూడా కలెక్టర్‌ను కలిశారు. గిరిజన సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా సర్వే చేయాలని ఒత్తిడి చేస్తోందని, ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని, అలాగే సచివాలయ ఉద్యోగుల సీనియార్టీ జాబితాను ప్రకటించాలని, అర్హులకు పదోన్నతులు కల్పించాలని సచివాలయ ఉద్యోగుల జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో శనివారం వారు కలెక్టర్ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జేఏసీ నాయకులు వరప్రసాద్, హనుమంతు, షణ్ముఖానందరెడ్డి, సల్మాన్‌బాషా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మంజూరు చేయాలని వినతి

గార్లదిన్నె, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్తాడు గ్రామానికి రోడ్డు మంజూరుకు కృషి చేయాలని టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవులక్రిష్ణయ్య కలెక్టర్ ఆనంద్‌ను కోరారు. మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. దీంతో ఆవులకృష్ణయ్యతో పాటు మర్తాడు గ్రామస్థులు ఆయన్ను కలిసి గార్లదిన్నె నుంచి మర్తాడు, కోటంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారిందన్నారు. ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. కనుక కొత్త రోడ్డు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. అదేవిధంగా స్థానిక జగనన్న కాలనీలోకి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు గేటుక్రిష్టారెడ్డి కోరారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు

ఆత్మకూరు సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సమీపంలో గల కొండపై ఉన్న మలహోబిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈఓ దేవదాస్, బీసీ సెల్ నాయకులు రాజారమేష్,ఉపేంద్ర,వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

అనంతపురం రూరల్, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకుతోటపల్లిలో శనివారం మండల వ్యవసాయాధికారి వెంకటకుమార్ రైతులకు యూరి యా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో రైతులకు 140బస్తాల యూరియా పంపిణీ చేశామన్నారు. రైతుల అవసరాలకు మేరకు యూరియా అందుబాటులో ఉందని, ఎక్కడా సమస్య లేదని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ మురళీ కృష్ణ, సర్పంచ్ గురుప్రసాద్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రాగే మురళి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



యూరియా పంపిణీ చేస్తున్న ఏఓ

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

● స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో వక్తల పిలుపు

న్యూస్‌నెట్‌వర్క్, (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని వక్తలు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం అనంతపురం అర్బన్, శింగనమల, రాప్తాడు నియోజకవర్గాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజా ప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, కూటమి నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొని పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాలు, సొసైటీ కార్యాలయాలతో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆస్పత్రుల ఆవరణలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునందించాలని కోరారు. అనంతరం పారిశుధ్య చర్యలు చేపట్టారు. అంతకుముందు ర్యాలీలు నిర్వహించి స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు.



బొందలవాడలో మొక్కకు నీరుపోస్తున్న ఉపసర్పంచ్ ఆలం వెంకట నరసానాయుడు



ఆత్మకూరులో మొక్కలు నాటుతున్న టీడీపీ మండల కన్వీనర్, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్మన్



రాప్తాడులో ఎంఈఓ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు



రాచానపల్లి సొసైటీ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న సొసైటీ చైర్మన్



అనంతపురం ఇండోర్‌స్టేడియంలో పారిశుధ్య పనులు చేస్తున్న డీఎస్‌డీఓ మంజుల, కోచ్‌లు



కురుగుంటలో ర్యాలీ ..



రామగిరిలో ..

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి: డీఎంహెచ్‌ఓ



మాట్లాడుతున్న ఈబీ దేవి

రాప్తాడు, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉండాలని, అప్పుడే వారి కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటాయని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీదేవి సూచించారు. మండలకేంద్రంలోని సచివాలయం-2 పరిధిలో శనివారం స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఈబీదేవి హాజరై మాట్లాడారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, కుటుంబ ఆరోగ్యంగా ఉంటే సమాజం బాగుంటుందని అన్నారు. కనుక మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా మొక్కలు నాటారు. సర్పంచ్ సాకే తిరుపాలు, వైద్యాధికారులు శివకృష్ణ, శ్రావణి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నంది విగ్రహం చోరీ నిగ్గు తేలాల్సిందే

● పోలీస్‌స్టేషన్ ఎదుట ముష్టికోవెల గ్రామస్థుల నిరసన



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టిన గ్రామస్థులు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): తమ గ్రామ సమీపంలోని శివుడి ఆలయంలో నందివిగ్రహం చోరీ సంఘటనను నిగ్గు తేల్చాల్సిందేనని ముష్టికోవెల గ్రామస్థులు పట్టుపట్టారు. నందివిగ్రహం ఆచూకీతో పాటు కేసు వివరాలు తెలపాలంటూ శనివారం వారు మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట మరోసారి ఆందోళన చేపట్టారు. నిందితులను వెంటనే అరెస్టు చేసి నంది విగ్రహం ఆచూకీ కనుగొనాలని నినదించారు. ఈనెల 4వ తేదీన నందివిగ్రహం చోరీకి గురైంది. దీనిపై గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన జరిగి రోజులు గడుస్తున్నా విగ్రహం ఆచూకీ తెలియకపోవడంతో ఈనెల 12న గ్రామస్థులు స్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళన చేసిన విషయం తెలిసిందే. బందోబస్తుతో బిజీలో ఉన్న కారణంగా ఆలస్యమైందని, దర్యాప్తును వేగవంతంచేస్తామని ఆరోజు ఎస్‌ఐ హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు. ఇంతవరకు చోరీ కేసులో ఎలాంటి పురోగతి లేకపోవడంతో రెండో సారి ఆందోళనకు దిగారు. పోలీసులు ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఎస్ఐ సత్యనారాయణ వారి వద్దకు చేరుకుని చర్చించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని నిందితుల ఆచూకి కోసం తీవ్రంగా శ్రమిస్తున్నామని అన్నారు. గ్రామస్థులు సహకరించి మరికొద్ది రోజులు సమయం ఇవ్వాలని సూచించడంతో వారు ఆందోళన విరమించారు.

పోలీసుల అదుపులో ఆరుగురు అనుమానితులు

కాగా ఈ కేసుకు సంబంధించి పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఆరుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది. అందులో ముష్టికోవలకు చెందిన ఐదుగురితో పాటు కర్ణాటకలోని అచ్చంపల్లికి చెందిన మరో వ్యక్తి ఉన్నట్టు తెలిసింది.

లింగ నిర్ధారిత వీర్యంతో పెయ్యదూడలు

● జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి వెంకటేష్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారిత వీర్యం వాడటం ద్వారా 90 శాతం పెయ్యదూడలు జన్మిస్తాయని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి వెంకటేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని క్షేత్ర స్థాయి సిబ్బంది పశువులకు తప్పనిసరిగా లింగ నిర్ధారిత వీర్యం (ఎస్ఎస్ఎస్) మాత్రమే వాడాలన్నారు. చిన్న వయస్సు కలిగిన దూడలకు లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించరాదన్నారు. సరిగ్గా ఎదలో లేని పశువులకు కూడా వాడకూడదన్నారు. ఆరు ఈతల కంటే ఎక్కువ ఈతలు కలిగిన పశువులకు వాడకూడదన్నారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా అనంత జిల్లాలో ఉచితంగా లింగనిర్ధారిత వీర్యాన్ని పశువులకు ఇస్తున్నట్లు తెలిపారు.

చెరువుకు నీరు తేవడానికి కృషి చేస్తా

● ఇరిగేషన్ డీఈఈ రాజ్‌కుమార్

శింగనమల, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని సలకం చెరువు గ్రామంలో గల చెరువుకు హెచ్ఎల్‌సీ ద్వారా నీటిని తీసుకుని రావడానికి కృషి చేస్తామని ఇరిగేషన్ డీఈఈ రాజ్‌కుమార్ తెలిపారు. ఆ చెరువుకు నీరు చేరే మార్గాలను శనివారం ఆయన ఏఈఈ సాయినాథ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బండారుశ్రావణిశ్రీ నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీటిని విడుదల చేయాలని సూచించారన్నారు. ఆ మేరకు సలకంచెరువులోని చెరువుకు కూడా నీటిని తీసుకురావడానికి మార్గాలు పరిశీలిస్తున్నామన్నారు. శింగనమల చెరువు నుంచి ఫీడల్ ఛానల్ ద్వారా, మిడ్ పెన్నార్ ఐదో కాలువ ద్వారా నీటిని తీసుకురావచ్చని గుర్తించామన్నారు. త్వరలోనే చెరువుకు నీటిని తీసుకొస్తామని చెప్పారు. కార్యక్రమంలో రైతులు బాలరాజు, తిరుపాలు, బయన్న , కేశవరాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వీయ క్రమశిక్షణ అవసరం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నేటి తరం విద్యార్థులు స్వీయ క్రమశిక్షణ, సంరక్షణ, సమాజం, పెద్దల పట్ల గౌరవం పెంపొందించుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని కేంద్ర క్రీడా యువజన వ్యవహారాల శాఖ హిందుస్థాన్ స్కౌట్స్ గైడ్స్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నాగచంద్ర బరీదు సూచించారు. విద్యార్థులలో క్రమశిక్షణ పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన స్కౌట్స్ , గైడ్స్ అవగాహన సదస్సులలో భాగంగా శనివారం ఆయన జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో పర్యటించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ చదువుతో పాటు సంస్కారం, సమాజం పట్ల బాధ్యత కచ్చితంగా కలిగిఉండాలని తెలిపారు. సమాజంలో ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు స్కౌటింగ్ కార్యక్రమాలు ఎంతగానో ఉపకరిస్తాయని పేర్కొన్నారు.

కొనసాగిన పెన్‌డౌన్

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): నగరంలో డాక్యుమెంటర్ రైటర్లు చేపట్టిన పెన్‌డౌన్ రెండో రోజైన శనివారమూ కొనసాగింది. డాక్యుమెంట్ రైటర్లు నిరసన తెలపడంతో డాక్యుమెంట్లు పదిలోపే జరిగాయి. తమ సమస్యలు పరిష్కరించాలని, ఆన్‌లైన్‌లో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను తొలగించాలని వారు కోరారు.

భక్తిశ్రద్ధలతో మాసశివరాత్రి పూజలు



అనంతేశ్వర స్వామి, అనంతేశ్వరికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మాస శివరాత్రిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం నగరంలోని పలు ఆలయాల్లో పూజాది కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నేపథ్యంలో శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరి సమేత అనంతేశ్వరస్వామిల మూలవిరాట్‌లకు అర్చకులు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేయడంతోపాటు విశేషపూజలు నిర్వహించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు.

రణభేరిని విజయవంతం చేయండి

రామగిరి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 25న జరిగే రణభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని కుంటిమద్ది పాఠశాలలో శనివారం సాయంత్రం ఆయన ఉపాధ్యాయులతో కలిసి రణభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. 12వ పీఆర్‌సీ అమలు, బకాయి పడ్డ డీఏలు, ఉమ్మడి సర్వీస్ రూల్స్ తదితర వాటిపై ఈ రణభేరి కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు బాలగొండ్ల శివయ్య, నాయకులు గోపాల్‌రెడ్డి, గడ్డం రామ్మోహన్, మల్లేశ్, శివారెడ్డి,పరిమిళ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పశువ్యాధి నిర్ధారణ కేంద్రం తనిఖీ



సమీక్షలో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం, వెటర్నరీ ఆస్పత్రిని పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పాడి రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో పశువ్యాధుల పరిస్థితి, గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ప్రయోగశాలలో బయో కెమికల్ అనలైజర్, హిమటలాజికల్ అనలైజర్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే వెటర్నరీ ఆస్పత్రిలో పశువులు, కుక్కల, ఇతర జీవాలకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రవిబాబు, ఏడీ సురేష్, వెటర్నరీ డాక్టర్లు సుబ్రహ్మణ్యం, శృతి పాల్గొన్నారు.

కుక్కల బెడదకు త్వరలోనే పరిష్కారం: మేయర్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న కుక్కల బెడదకు అతి త్వరలో పరిష్కారం చూపుతామని మేయర్ మహ్మద్‌వసీం తెలిపారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగరంలో కొంత కాలంగా కుక్కల సమస్య అధికంగా ఉందని ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. దీనిపై డీఎంఏ సంపత్‌కు మార్, కలెక్టర్, నగర కమిషనర్‌ల దృష్టికి తీసుకెళ్లామన్నారు. మూగజీవాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలనే నిబంధనలు ఉండడంతో కుక్కల బెడద నివారణ చర్యలలో కొంత జాప్యం జరిగిందన్నారు. నగరపాలక కమిషనర్ బాలస్వామి ప్రత్యేక చొరవ తీసుకుని మరోసారి రాష్ట్ర ప్రభుత్వం, డీఎంఏల దృష్టికి తీసుకెళ్లి హర్యానాకు చెందిన స్నేహ అనిమల్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా నగరంలో ఉన్న కుక్కలకు అనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) చేయడానికి అనుమతులు పొందారని తెలిపారు. దీంతో ఏబీసీ ఆపరేషన్ ద్వారా కుక్కల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. త్వరలో ఏబీసీ ఆపరేషన్లు ప్రారంభించి నగరవాసులకు కుక్కల బెడద నుంచి విముక్తి కల్పిస్తామని పేర్కొన్నారు.

'అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు'

అనంతపురం క్రైం, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని, మంత్రి సవితమ్మపై విమర్శలు చేస్తే సహించబోమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల మురళి మండిపడ్డారు. నగరంలోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ నాయకులు గత ప్రభుత్వంలో మెడికల్ కాలేజీల పేరుతో ప్రజా ధనాన్ని దోచేశారంటూ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 15 నెలల్లోనే సంక్షేమం, అభివృద్ధి చేసుకుంటూ ప్రజల ఆదరణ సొంతం చేసుకుందన్నారు. ఇది చూసి ఓర్వలేక...వైసీపీ నాయకులు తమ ఉనికి కాపాడుకోడానికి విమర్శలు చేస్తున్నారన్నారు. మంత్రి సవితపై విమర్శలు చేయడం సరికాదన్నారు. లేనిపోని ఆరోపణలు చేస్తే చూస్తూ.. ఊరుకోమని హెచ్చరించారు. నాయకులు రవీంద్ర, రాజు, పెద్దన్న పాల్గొన్నారు.

ట్రెల్లిస్ స్కూల్‌కు ఎక్సలెన్సీ అవార్డు

అనంతపురంవిద్య, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): నగరంలోని ట్రెల్లిస్ స్కూల్‌కు అరుదైన ఎక్సలెన్సీ అవార్డు దక్కింది. టైమ్స్‌ఆఫ్‌ఇండియా గ్రూపు నుంచి ఉద్యోగులు భావోద్వేగసంబంధం, నాయకత్వంలో స్కూల్‌కు అవార్డు లభించింది. ఈనేపథ్యంలో శనివారం రాత్రి విజయవాడలో ఏ కన్వన్షన్‌లో జరిగిన సదస్సులో రాష్ట్ర పౌరసరపరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా ట్రెల్లిస్ స్కూల్ చైర్మన్ వడ్ల శ్రీకాంత్ ఈఅవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఈఅవార్డు పొందడం పాఠశాల నిబద్ధతకు నిదర్శనమన్నారు. అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందని అన్నారు.

'వారిపై చర్యలు తీసుకోండి'

అనంతపురంవిద్య సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో శనివారం ఎస్పీజగదీష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లాకార్యదర్శి పాళ్యం నారాయణస్వామి సహాయకార్యదర్శులు మల్లికార్జున, రాజారెడ్డి, నగర కార్యదర్శి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ ప్రొఫెసర్‌కు అవార్డు



ప్రొఫెసర్ శోభాబిందుకు అవార్డు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల సీఎస్‌ఈ విభాగ ప్రొఫెసర్ శోభాబిందుకు ఉత్తమ ఇంజనీర్ అవార్డు దక్కింది. విజయవాడలోని డా.కేఎల్ రావు భవన్‌లో రెండ్రోజుల క్రితం అవార్డు అందజేశారు. దీంతో ప్రొఫెసర్ శోభాబిందును జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, డైరెక్టర్లు, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర అభినందించారు.

శాస్త్రోక్తంగా మోక్షనారాయణుడి ముక్తి హోమం



ముక్తి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం టౌన్, సెప్టెంబరు20(ఆంధ్రజ్యోతి): మహాలయ పక్షాలను పురస్కరించుకుని తపోవనంలోని శివశక్తి సాయి ఆలయంలో శనివారం సాయి ట్రస్టు ఆధ్వర్యంలో మోక్ష నారాయణుడి ముక్తిహోమంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో తొలుత గోపూజతో కార్యక్రమాన్ని ఆరంభించారు. అనంతరం మోక్ష నారాయణుడి ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. తదనంతరం సాయి ట్రస్టు ఆధ్వర్యంలో అంతిమ సంస్కారాలు నిర్వహించిన 1791 మందితోపాటు ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణ పొందిన సైనికులు, విధి నిర్వహణలో మృతిచెందిన పోలీసుల ఆత్మశాంతికోసం ముక్తిహోమాన్ని నిర్వహించి, ముక్తిదీపాలు వెలిగించి పూజలు చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో ముందస్తు దసరా సంబరాలు





మినర్వా, నారాయణ స్కూళ్లలో అమ్మవార్ల వేషధారణలో విద్యార్థినులు

అనంతపురంవిద్య, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): దసరా సెలవులు రావడంతో శనివారం నగరంలోని వివిధ పాఠశాలల్లో ముందస్తుగా విజయదశమిసంబరాలు ఘనంగా జరిపారు. అశోక్‌నగర్‌లో గల మినర్వా పాఠశాలలో దసరా విశిష్టత తెలియజేయడానికి విద్యార్థినుల చేత అమ్మవార్ల వేషధారణలు వేయించి నాటికలు ప్రదర్శించడం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో కరస్పాండెంట్ భాస్కరరెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే రామ్‌నగర్‌లోగల నారాయణ స్కూల్లో కూడా విద్యార్థులు నవదుర్గ వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో ఏజీఎం సుధాకర్, ప్రిన్సిపాల్ నీలిమ, వైస్‌ప్రిన్సిపాల్ విక్టోరియా, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ 'జగడం'!

అనంతపురం క్రైం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు నుంచి శ్రీకంఠం సర్కిల్‌కి మధ్యలో రోడ్డుపై పెద్దఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యింది. మధ్యాహ్నం ఈ రహదారిలో ఖజానా జువెల్లరీ ఎదుట... ఆటో- కారు ఢీకొనడంతో ఇరు వాహనదారుల మధ్య గొడవ జరిగింది. వారు రోడ్డుపై వాహనాలు నిలిపి వాగ్వాదం చేసుకుంటుండడంతో మిగతా వాహనాలు ముందుకువెళలేక ట్రాఫిక్ జామ్ అయింది. ఆర్టీసీ బస్టాండ్ నుంచీ శ్రీకంఠం సర్కిల్ వైపు వచ్చే వందలాది వాహనాలు ఆగిపోయాయి. మరోవైపు దసరా పండుగకు సెలవులు ప్రకటించడంతో.. ఆర్టీసీ బస్టాండ్‌కు రాకపోకలు పెరిగాయి. ఈ క్రమంలో భారీగా వాహనాలు రావడంతో పాటు, ఇదే క్రమంలో అక్కడ గొడవ జరగడం లో సుమారు గంటసేపు ట్రాఫిక్‌జామ్ అయ్యిం ది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ట్రాఫిక్ పోలీసులు మాత్రం తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదంటూ పేర్కొన్నారు.





శ్రీకంఠం సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే రూట్‌లో స్తంభించిన ట్రాఫిక్

సంక్షిప్త వార్తలు

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు


అలంకరణలో అంజనేయస్వామి

బొమ్మనహాళ్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామం లో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు అనిల్ కుమార్ చార్యులు ఉదయం పూజలు ప్రారంభించారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదలు స్వీకరించారు. ఆలయ సన్నిధిలో అన్నదానం నిర్వహించారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు: డీఎస్పీ


తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

యాడికి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం తెలిపారు. శనివారం మండలంలోని రాయలచెరువులో పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. న్యూలక్ష్మి వెంకటేశ్వర ఫర్టిలైజర్స్, శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఫర్టిలైజర్స్, భాస్కర ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ఎరువులు, రికార్డులను పరిశీలించారు. న్యూలక్ష్మి వెంకటేశ్వర ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులు సరిగా లేని రూ.1.85 లక్షల విలువగల ఎరువుల అమ్మకాల నిలిపివేతకు ఉత్తర్వులు ఇచ్చారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించిన, ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు అమ్మినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏఓ వాసుప్రకాష్, ఎస్ఐ నరేంద్రభూపతి, మండల వ్యవసాయాధికారి మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

23న మెగా జాబ్‌మేళా

యాడికి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఈనెల 23న మెగాజాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హరినాథ్‌రెడ్డి తెలిపారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్ ఆధ్వర్యంలో పలు నేషనల్, మల్టీనేషనల్ కంపెనీలు వస్తున్నట్లు వివరించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమో, బీటెక్ చదివిన అభ్యర్థులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ముందుగా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. అడ్మిట్‌కార్డుతో మెగా జాబ్ మేళాకు హాజరుకావాల్సి ఉంటుందని వివరించారు. వివరాలకు వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

రిజర్వాయరుకు 2,268 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 2,268 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉన్నట్లు శనివారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో 2,228 క్యూసెక్కులు వెళుతోందని, ప్రస్తుతం రిజర్వాయరులో 1.716 టీఎంసీలు నీటి నిల్వ వుందని వెల్లడించారు. ఫేజ్-2కు 1798 క్యూసెక్కులు వెళుతోందని అధికారులు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కుందుర్పి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యువశక్తి కంప్యూటర్ శిక్షణ సంస్థ డైరెక్టర్ టి జయన్న స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈమేరకు శనివారం పాఠశాలలో హెచ్‌ఎం వరలక్ష్మీ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు లక్ష్మీదేవి, తిప్పేస్వామి, పాఠశాల కాంప్లెక్స్ ఛైర్మన్ గోపిచంద్ హాజరయ్యారు. 30 మంది విద్యార్థులకు జయన్న ప్రవేశ పరీక్ష పుస్తకాలు వితరణ చేశారు.

ఇసుక డంపు సీజ్

గుమ్మఘట్ట, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడిగుప్ప గ్రామ శివారులో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపును శనివారం రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణబాబు సీజ్ చేశారు. రాయదుర్గం ప్రాంతానికి చెందిన కొంతమంది ఇసుకను ప్రభుత్వ భూమిలో డంప్ చేసి అక్రమంగా కర్ణాటక ప్రాంతానికి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో డంపును సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. విచారణ చేసి అనుమానితులపై కేసు నమోదు చేయనున్నట్లు వివరించారు.

అపార్ ఐడీని నమోదు చేయండి

కణేకల్లు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు అపార్ ఐడీని నమోదు చేయించాలని సీడీపీఓ నాగమణి పేర్కొన్నారు. శనివారం మండలంలోని బెణెకల్లులో చిన్నారుల తల్లిదండ్రులకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, శాంతకుమారి, తిరుపాల్‌బాయి పాల్గొన్నారు.

10 మందిపై కేసు నమోదు

యాడికి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నగరూరు గ్రామంలో సింహాద్రి అనే యువకుడిపై దాడిచేసి గాయపరిచిన సంఘటనలో అదే గ్రామానికి చెందిన 10 మందిపై శనివారం కేసు నమోదుచేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. నగరూరు గ్రామానికి చెందిన సింహాద్రి అనేయువకుడు గ్రామానికి చెందిన ఒక యువతిని ప్రేమించినట్లు తెలిపారు. దీనిపై ఆగ్రహంతో ఉన్న యువతి బంధువులు సింహాద్రిపై దాడిచేసి గాయపరిచినట్లు తెలిపారు. సింహాద్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజు, ఓబులు, మరో 8మందిపై కేసు నమోదుచేసినట్లు వెల్లడించారు.

హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ కన్వీనర్ నియామకం

తాడిపత్రి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): హ్యూమన్‌రైట్స్ అసోసియేషన్ స్టేట్ కన్వీనర్‌గా గుత్తా భాస్కర్‌నాయుడును జాతీయ అధ్యక్షుడు నరసింహారావు నియమించారు. ఈ మేరకు పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో శనివారం హ్యూమన్‌రైట్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జాతీయ అధ్యక్షుడు నరసింహారావు, స్టేట్ అధ్యక్షుడు శివకుమార్, మహిళా అధ్యక్షురాలు కాకర్ల సరస్వతి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్టేట్ కన్వీనర్‌గా నియమితులైన గుత్తా భాస్కర్‌నాయుడును మాట్లాడుతూ.. ప్రజాసేవ చేయడంలో తన వంతు కృషిచేస్తానని, ఏ సమస్య వచ్చినా ధైర్యంగా పోరాడి న్యాయం చేస్తానని తెలిపారు.


భాస్కర్‌నాయుడిని సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

10 గంటలకే గోడౌన్ ఖాళీ

● 20 మంది రైతులకే యూరియా పంపిణీ
● అధికారులతో రైతుల వాగ్వాదం


యూరియా పంపిణీ చేస్తున్న అధికారులు, ఖాళీ అయిన గోడౌన్

విడపనకల్లు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీ ప్రహసనంగా మారింది. శనివారం యూరియా కోసం రైతులు మండలం కేంద్రానికి వచ్చారు. ఉదయం 10 గంటలకే స్టాకు అయిపోయిందని అధికారులు గోడౌన్‌కు తాళాలు వేయడంతో రైతులు వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా యూరియా కోసం వచ్చిన కొంత మంది రైతులు మాట్లాడుతూ.. శుక్రవారం యూరియా పంపిణీలో ఓ రాజకీయ నాయకుడికి ఒకే ఆటోలో 20 బస్తాలు వేసి పంపారు అన్నారు. శనివారం ఇస్తామన్న అధికారులు 20 మంది రైతులకు మాత్రమే పంపిణీ చేసి యూరియా అయిపోయిందంటూ గోడౌను(రైతు సేవా కేంద్రానికి) తాళాలు వేసుకుని వెళ్లారని మండిపడ్డారు. ఇంకో వారం రోజులు యూరియా అడగొద్దంటూ చెప్పారని వాపోయారు. రాజకీయ పలుకుబడి ఉన్న రైతులకే యూరియా ఇస్తున్నారని ఆవేదన చెందారు.

ప్రైవేటు డీలర్ల విచారణ చేపట్టాలి

'వేరే ఎరువు కొంటేనే యూరియా..!' అంటూ శనివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై అధికారులు ఎందుకు విచారణ చేపట్టలేదని మాజీ ఎంపీపీ రమణారెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు ఫర్టిలైజర్ షాపుల యజమానులతో కుమ్మక్కు కావటంతోనే విచారణ చేపట్టలేదన్నారు. ప్రైవేటు డీలర్ల వద్దకు యూరియా కోసం రైతులు వెళితే చుక్కలు చూపిస్తున్నారని తెలిపారు. రైతులకు అవసరం లేని ఎరువులను అంటగట్టి వేల రూపాయలు దోచుకుంటున్నారని అన్నారు.

యూరియా దారి తప్పుతోందా..?


స్లిప్పులను పరిశీలిస్తున్న అధికారులు

యల్లనూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సహకార సొసైటీకి సరఫరా అవుతున్న యూరియా దారి తప్పుతోందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యూరియా వస్తూనే పంపిణీ చేయకుండా కాలయాపన చేస్తుండడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. టోకెన్లు వ్యవసాయశాఖ ద్వారా కాకుండా సొసైటీ సిబ్బంది స్వయంగా రంగంలోకి దిగి ఇస్తున్నారు. శుక్రవారం జరిగిన పంపిణీలో సొసైటీ సిబ్బంది రైతులకు ఇచ్చిన టోకెన్లకే యూరియా ఇస్తామని, వ్యవసాయశాఖ అధికారులు రైతుభరోసా కేంద్రాల వద్ద ఇచ్చిన వాటికి ఇవ్వబోమని సొసైటీ సీఈఓ వీరనారప్ప చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా వద్ద ఇచ్చిన టోకెన్లు రైతులకు కాదా అని మండిపడ్డారు. ఈ విషయంలో వ్యవసాయాధికారులు, సొసైటీ సిబ్బంది మధ్య వాదోపవాదాలు జరగడం చూస్తుంటే ఏమి జరుగుతోందో అర్థం కాని పరిస్థితి కనిపించింది.

సక్రమంగా వినియోగించండి: కాలవ


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): యూరియాను రైతులు సక్రమంగా వినియోగించి ప్రభుత్వానికి సహకరించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ద్వామా హాలులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఎరువుల దుకాణదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యూరియా వినియోగం ప్రస్తుత సీజన్‌లో భారీగా పెరిగిందన్నారు. కొరత తలెత్తకుండా ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులతో నిత్యం చర్చిస్తున్నామన్నారు. ప్రస్తుత సీజన్‌లో నియోజకవర్గానికి 7,150 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతుందని ప్రతిపాదిస్తే ఇప్పటి వరకు 6250 మెట్రిక్ టన్నులు సరఫరా అయిందన్నారు. ఏఏ పంటలకు ఏ మేరకు యూరియా వినియోగించాలన్న సూచనలను వ్యవసాయశాఖ విస్తృతంగా రైతుల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో వ్యవసాయ ఏడీ పద్మ, అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు


బుక్‌లెట్లను విడుదల చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

గుంతకల్లు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో 11 రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవ కార్యక్రమాల బెక్‌లెట్‌ను ఆర్యవైశ్య సంఘ నాయకులు శనివారం విడుదల చేశారు. కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష, కార్యదర్శులు గోపా జగదీశ్, కందూరి కృపాకర్ మాట్లాడుతూ.. ఈ నెల 22వ తేదీ మొదలుకుని దసరా మరుసటి రోజు వరకూ 11 రోజులపాటు ఆలయంలో నిరంతర వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. దసరా వరకూ ప్రతిరోజూ అమ్మవారికి అభిషేకాలు, పూజలు, అర్చనలు, గణపతి పూజలతో పాటు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య గౌరవాధ్యక్షుడు చెల్లూరు నరసింహులు, కోశాధికారి మేడా వెంకటేశ్వర్లు, నాయకులు నామా జీవన్ గుప్తా, రాజా రమణ, ఇనుగూరు సుబ్బయ్య, కె.సత్య, జయంతి సూర్యనారాయణ పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్లను తొలగించండి


ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రం ఇస్తున్న క్షౌరవృత్తిదారుల సంఘం నాయకులు

గుంతకల్లు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): క్షౌర వృత్తిదారులకు జరుగుతున్న అన్యాయాన్ని అడ్డుకుని న్యాయం చేయాలంటూ ఆ సంఘ నాయకులు ఆర్డీవో శ్రీనివాసులుకు విన్నవించారు. శనివారం ఉదయం పట్టణంలో కార్పొరేట్ సెలూన్లను తొలగించాలంటూ క్షౌర వృత్తిదారుల సంఘ నాయకులు సంతకాల సేకరణ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి వినతి పత్రాన్ని అందజేశారు. క్షౌర వృత్తిదారుల సంఘ జిల్లా కన్వీనర్ బి. శ్రీనివాసులు ఆర్డీవోతో మాట్లాడుతూ.. కార్పొరేట్ సెలూన్ల కారణంగా క్షురకులు రోడ్డున పడతారని అన్నారు. తరతరాలుగా వృత్తిని నమ్ముకున్న తమకు న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బెలగండి లక్ష్మీనారాయణ, సూరి, బ్రహ్మ, అజయ్, శివ, వాసు, ఎర్రిస్వామి, చరణ్, బాల, కుమార్ పాల్గొన్నారు.

కమ్మూరులో ఉచిత పశు వైద్యశిబిరం


పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న అధికారులు

కూడేరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మూరు గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా శనివారం పశువులకు ఉచిత చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఏ ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ.. పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధుల వల్ల కలిగే అనర్థాలను రైతులకు వివరించారు. గాలికుంటువ్యాధి టీకాల ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం పశువులకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వెంకటేష్, డీఎల్‌డీవో పద్మనాభం, పశువైద్యులు శ్రీనివాసులు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు: డ్రైవర్‌కు స్వల్ప గాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్నకారు

పుట్లూరు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులో శనివారం కారు అదుపుతప్పి బోల్తాకొట్టింది. దీంతో డ్రైవర్ శ్రీనివాసులుకు స్వల్పగాయాలయ్యాయి. తాడిపత్రి నుంచి పుట్లూరుకు వస్తుండగా నాగిరెడ్డిపల్లి క్రాస్ వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని సీఐ సత్యబాబు పరిశీలించారు.

ప్రభుత్వ విప్‌కు ఫర్టిలైజర్స్ డీలర్ల సన్మానం

కణేకల్లు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫర్టిలైజర్స్ డీలర్ల సంఘం తరపున ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులును సన్మానించారు. శుక్రవారం రాయదుర్గంలో ఎమ్మెల్యేను కలిసి మండలానికి అధికంగా యూరియాను మంజూరు చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం అధ్యక్షుడు చాంద్‌బాషా, నాయకులు మహేష్‌గుప్తా, శరత్, తుకారం, శంకర్, సుబ్బయ్య, మంజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

● న్యాయాధికారి దుర్గా కల్యాణి
● పలుచోట్ల స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర


ఉరవకొండ కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న న్యాయాధికారి దుర్గా కల్యాణి

ఉరవకొండ, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి దుర్గాకల్యాణి పేర్కొన్నారు. స్థానిక కోర్టు ఆవరణంలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆమె మొక్కలు నాటారు. మొక్కలను నాటడమే కాకుండా, వాటిని పరిరక్షించాలని సూచించారు. జూనియర్ కళాశాల మైదానంలో మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో ఏపీవో సునీత, కార్యదర్శి గౌస్‌సాహెబ్, టీడీపీ నాయకులు గోవిందు, తిమ్మప్ప, నాగేశ్వరరావు, తాజుద్దీన్, సుంకన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.

● కూడేరు : మండలంలో అన్ని గ్రామపంచాయతీల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుళ్లాయిస్వామి, సర్పంచు లలితమ్మ, డిప్యూటీ ఎంపీడీవో రాధాకృష్ణ, జేఈ రమణయ్య, ఏపీవో పోలేరయ్య పాల్గొన్నారు.

● విడపనకల్లు : మండలంలోని వివిధ గ్రామాల్లో అధికారులు ర్యాలీలు నిర్వహించి మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ సత్యబాబు, ఏఓ భాస్కర్ బాబు, సర్పంచ్ చంద్రశేఖర్, కార్యదర్శి మహేష్, టీడీపీ నాయకులు హనుమంతు, రంగస్వామి, పరమేషప్ప, చంద్ర పాల్గొన్నారు.

● బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా ప్రతి పంచాయతీలోనూ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ దాస్, కార్యదర్శి శివన్న, నాయకులు నవీన్, సంగప్ప, హనుమంత, బాబు పాల్గొన్నారు.

● పెద్దవడుగూరు: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఏపీడీ పుల్లారెడ్డి, సిబ్బంది మొక్కలు నాటారు. ఎంపీడీఓ బారెన్‌సాబ్, సిబ్బంది పాల్గొన్నారు.

● కుందుర్పి : మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఓబులేసు, ఎంపీడీవో లక్ష్మీశంకర్, డిప్యూటీ ఎంపీడీవో హరికృష్ణ, వెలుగు ఏపీఎం సర్దానప్ప, ఏపీవో మురళీ, నాయకులు రంగనాథ, ఓబయ్య, పెద్ద నరసింహప్ప, శివలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

● రాయదుర్గంరూరల్: స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, నోడల్ ఆఫీసర్ డి. నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

● యాడికి : మండలంలోని పలుచోట్ల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉమాదేవి, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, యాడికి సర్పంచు అనురాధ, డిప్యూటి ఎంపీడీఓ శశికళ, ఏఓ నాగేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఎం సీతారామాంజనేయులు, డీటీ శ్రీనివాసులు, ఆర్ఐ కిష్టప్ప పాల్గొన్నారు.

● గుంతకల్లు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కూరగాయల మార్కెట్ వ్యాపారులకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్. భవాని, టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి తెలిపారు. స్థానిక వెజిటబుల్ మార్కెట్‌లో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనరు నయీం అహ్మద్, టీడీపీ నాయకులు ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, గుణశేఖర్, ఫజులు, రామన్న చౌదరి, కృపాకర్, విద్యారాణి, హిమబిందు, అంజి, హనుమంతు, వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

● కళ్యాణదుర్గంరూరల్ : పచ్చనిచెట్లు ప్రగతికి మెట్లు అని ఆర్డీవో వసంత్‌బాబు, డీఎస్పీ రవిబాబు తెలిపారు. పట్టణంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో భాగంగా మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ యువరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

● రాయదుర్గం : పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యమని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. మున్సిపల్ సిబ్బందితో చెత్త, చెదారాన్ని తొలగించడంతో పాటు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు పొరాళు పురుషోత్తం, వెంకటేశులు, శ్రీనివాసులు, భారతి, ప్రశాంతి, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

● డి.హీరేహాళ్ : మండల వ్యాప్తంగా స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ హనుమంత, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి రాజు, ఎంపీడీఓ దాసనాయక్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మురడి గ్రామస్థులు

డీ.హీరేహాళ్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటున్న ఆర్డీటీని కాపాడాలని మండలంలోని మురడి గ్రామంలో బీమాసేవా సమితి, సర్పంచ్ గంగప్ప ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్, బీమాసేవా సమితి సభ్యులు మాట్లాడుతూ.. దేశంలోనే అత్యంత వెనుకబడ్డ అనంతపురం జిల్లాను ఎంచుకొని, ఇక్కడి పేద ప్రజల జీవితాలలో వెలుగులు నింపాలనే సంకల్పంతో ఫాదర్ ఫెర్రర్ ఆర్డీటీని స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. జిల్లాలో ఎంతో మంది పేదలకు ఆసరాగా నిలిచిన ఆర్డీటీకి కేంద్రం ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయకపోవడంతో నిధులు నిలిచిపోయాయన్నారు. కార్యక్రమంలో బీమాసేవా సమితి వ్యవస్థాపకుడు బసవరాజు, నాయకులు తిప్పేస్వామి, సంతోష్, భార్గవ్, సోమేష్, హేమంత్ పాల్గొన్నారు.

బియ్యం తరలిస్తే జిల్లా నుంచి బహిష్కరించాలి

- మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి



తాడిపత్రి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యాన్ని అక్రమంగా అమ్మితే జిల్లా బహిష్కరించాలని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నివాసంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చే బియ్యాన్ని పేదలకు పంపిణీ చేయాల్సింది పోయి అక్రమంగా అమ్ముకొని సొమ్ము చేసుకోవాలని చూస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. బియ్యం వ్యాపారులు అధికారులతో లాలూచీ పడితే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాంటి వారిని జిల్లా బహిష్కరించాలని తెలిపారు. స్టోర్‌డీలర్లు అక్రమంగా బియ్యాన్ని పంపిణీ చేస్తే డీలర్‌షిప్ రద్దుచేసి వేరేవాళ్లకు అప్పగిస్తామని అన్నారు. రేషన్ బియ్యం, ఉపాధి, అంగన్‌వాడీకి సంబంధించినవి సరిగా లేకపోతే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అన్నారు.

రాష్ట్రస్థాయి ఈత పోటీలకు ఎంపిక


విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

గుంతకల్లు, సెప్టెంబరు20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలపెంట ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు ఎంపికయ్యారు. అనంతపురంలోని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో గత వారం నిర్వహించిన జిల్లా స్థాయి ఈత పోటీల్లో ములకలపెంట ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు ఎం. షర్మిల, పి. గణేశ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఆర్. ఓబులరాజు, పీడీ సత్యనారాయణ శనివారం తెలిపారు.

● బ్రహ్మసముద్రం : జిల్లా స్థాయిలో జరిగిన సౌత్ జోన్ అథ్లెటిక్స్ 18 పోటీలలో అండర్-18 విభాగంలో జి. శకుంతల వంద మీటర్లలో మొదటి స్థానం, లాంగ్ జంప్‌లో 4.29 మీటర్లు దూకి మొదటి స్థానం సాధించింది. ఇదే పాఠశాల విద్యార్థి అరవింద్, అండర్ 18 విభాగంలో లాంగ్‌జంప్‌లో 5.35 మీటర్లు దూకి రెండవస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రమౌళి, పీఈటీ ఇబ్రహీం తెలిపారు.

భక్తిశ్రద్ధలతో జలధి పూజ


ఊరేగింపుగా వస్తున్న పూజారి, భక్తులు

బెళుగుప్ప, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుడిలో శనివారం గిరినాథ స్వామి జలధి పూజను ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామశివార్లలోని నీటి పరివాహక ప్రాంతానికి వెళ్లి గంగపూజ చేసి కలశాన్ని ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. గోవింద నామస్మరణతో మారు మోగింది. తీర్థప్రసాదాల వినియోగంతో జలధిపూజ ముగిసింది.

ఆర్డీవో కార్యాలయం వద్ద వీఆర్‌ఏల ధర్నా

గుంతకల్లు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ రెవెన్యూ సహాయకులు స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ డివిజన్ పరిధిలోని మండలాల్లో పనిచేస్తున్న వీఆర్‌ఏలు గుంతకల్లులోని ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళనచేపట్టారు. అనంతరం ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని అందజేశారు.

యువతి ఆత్మహత్య


జూనీ బైపీ మృతదేహం

గుంతకల్లు, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ లాడ్జిలో పనిచేస్తున్న జూనీ బైపీ (19) అనే యువతి శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. అస్సాంకు చెందిన ఈమె తన భర్త, సోదరుడితో కలసి నివసిస్తూ ఓ లాడ్జిలో పనిచేస్తున్నారు. శనివారం తెల్లవారుజామున ఆమె ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని విచారిం చారు. భర్తతో మనస్పర్థల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది.

కుటుంబ కలహాలతో వ్యక్తి..


రమణ (ఫైల్)

పెద్దవడుగూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలచెరువు గ్రామానికి చెందిన రమణ (48) అనే వ్యక్తి కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. శనివారం రమణ మద్యం తాగి ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు వాగ్వాదానికి దిగారు. దీంతో మనస్తాపానికి గురై ఇంటిలో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలో మృతి చెందినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

నీటి సరఫరాలో అంతరాయం

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): కణేకల్లు వద్ద ఉన్న ఎస్ఎస్‌ట్యాంక్ పైప్‌లైన్ లీకేజీ కావడంతో రాయదుర్గం పట్టణానికి ఆదివారం నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని కమిషనర్ దివాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు చేసిన అనంతరం పట్టణానికి నీటి సరఫరాను అందిస్తామని తెలిపారు.

రెండోరోజు డాక్యుమెంట్ రైటర్ల నిరసన

యాడికి, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆస్తుల క్రయ, విక్రయాల్లో ప్రభుత్వ విధానాలకు నిరసనగా యాడికిలో డాక్యుమెంట్ రైటర్లు శనివారం నిరసన వ్యక్తం చేశారు. దీంతో రిజిస్ట్రేషన్లు పూర్తిగా నిలిచిపోయాయి. నిరసనలో డాక్యుమెంట్ రైటర్లు రజాక్, నరేష్, నవీన్, రామకేశవులు పాల్గొన్నారు.

వడ్డెర్ల సంక్షేమానికి పాటుపడతాం

గుత్తి, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వడ్డెర్ల సంక్షేమానికి పాటుపడతామని వడ్డెర కమ్యూనిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఓసీసీఐ) రాష్ట్ర అధ్యక్షురాలు దేరంగుల లక్ష్మీదేవి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మారుతీ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఓసీసీఐ సంఘ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ.. వడ్డెర్లు సామాజికంగా, ఆర్థికంగా రాణించేందుకు తమ వంతు కృషిచేస్తామన్నారు. అనంతరం నూతనంగా పదవీ బాధ్యతలను చేపట్టిన అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీదేవి, మారుతీ ప్రసాద్‌ను సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, హనుమంతు, చంద్ర, వీరన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఓసీసీఐ రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మీదేవి